RNI : TGMUL/25/A1386

# తొలి అక్షరం

మా అక్షరమే - మీ అయుధంగా...

చైర్మన్& చీఫ్ ఎడిటర్ పస్తం సైదులు

www.tholiaksharam.com

ఎడిటర్: పి.సైదులు, సంపుటి : 03 సంచిక - 54 పేజీలు - 08 బుధవారం 21 జనవరి 2026

## నిలదీస్తే కేసులా.. హరీశ్‌రావును సిట్ విచారణకు పిలువడంపై కేటీఆర్ ఫైర్


**తొలి అక్షరం/హైదరాబాద్,జనవరి 20:** రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ సర్కారుపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో మాజీ మంత్రి హరీశ్‌రావును సిట్ విచారించడంపై ఆయన స్పందించారు. ఇది సిట్ విచారణ కాదని, పిచ్చి విచారణ అని వ్యాఖ్యానించారు. తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడిన ఆయన.. న్యాయం కోసం తాము హైకోర్టు నుంచి సుప్రీంకోర్టు వరకైనా వెళతామని చెప్పారు.కాంగ్రెస్ పార్టీ ప్రజలకు మోసపూరిత హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందని కేటీఆర్ విమర్శించారు. ఇచ్చిన హామీలను నెరవేర్చలేక నిలదీసిన వారిపై కేసులు నమోదు చేస్తోందని మండిపడ్డారు. సింగరేణి టెండర్ల కుంభకోణంలో అసలు సూత్రధారి సీఎం బావమరిది సృజన్‌రెడ్డేనని ఆరోపించారు.

ఈ కుంభకోణంపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

'ఫోన్ ట్యాపింగ్ కేసు పసలేని కేసు అని గతంలో సుప్రీంకోర్టే చెప్పింది. అయినా గూడా ఆ కేసును సాగదీయడంలో అర్థం ఏముంది.. ఈ కేసుకు సంబంధించి సిట్‌గానీ, సర్కారుగానీ ఒక్క ప్రెస్‌మీట్ అయినా పెట్టి అధికారికంగా మాట్లాడిందా.. ఒక్కరిపైన అయినా నేరం రుజువైందా.. తప్పు జరిగింది అంటరు. మరి ఎందుకు నిరూపించలేకపోతున్నరు..' అని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తంచేశారు.

# బిజెపి కొత్త సారథిగా నితిన్ నబిన్ సిన్హా

- పార్టీ కార్యాయలంలో అధ్యక్ష బాధ్యతలు స్వీకరణ
- హాజరైన ప్రధాని మోడీ, నడ్డా, అమిత్ షా, రాజ్‌నాథ్, గడ్కరీ
- సామాన్య కార్యకర్తకు అత్యున్నత స్థానానికి ఎదగడం బిజెపిలోనే సాధ్యం
- వివిధ అంశాలపై నితిన్ భావోద్వేగ ప్రసంగం
- నా బాస్ నితిన్ నబిన్ అంటూ మోడీ చమత్కారం





**తొలి అక్షరం/న్యూఢిల్లీ,జనవరి 20:** భారతీయ జనతా పార్టీ నూతన జాతీయ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన నితిన్ నబీన్ సిన్హా మంగళవారం ఉదయం 11 గంటల సమయంలో ఆయన జాతీయ అధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం చేశారు. ఢిల్లీలోని పార్టీ ప్రధాన కార్యాలయంలో ప్రధాని మోదీ సమక్షంలో కమల దళపతిగా నితిన్ ప్రమాణస్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో పూర్వ అధ్యక్షుడు జెపి నడ్డా, కేంద్ర మంత్రులు అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్, మిగతా2లో...






# భారత్ ఫ్యూచర్ సిటీ అభివృద్ధికి తోడ్పాటు

- తెలంగాణతో కలిసి పనిచేస్తామన్న యూఏఈ
- రేవంత్‌తో మంత్రి అబ్దుల్లా బిన్ తౌక్ అల్ మార్రీ భేటీ

**తొలి అక్షరం/హైదరాబాద్,జనవరి 20:** భారత్ ఫ్యూచర్ సిటీని ప్రపంచ స్థాయి నగరంగా అభివృద్ధి చేసేందుకు తెలంగాణతో కలిసి పనిచేయడానికి యూఏఈ ప్రభుత్వం సిద్ధంగా ఉందని యూఏఈ ఆర్థిక, పర్యాటక శాఖ మంత్రి హెచ్.ఈ. అబ్దుల్లా బిన్ తౌక్ అల్ మార్రీ తెలిపారు. ప్రపంచ ఆర్థిక వేదిక -2026 సదస్సులో భాగంగా దావోస్‌లో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో యూఏఈ మంత్రి మంగళవారం భేటీ అయ్యారు. 'తెలంగాణ రైజింగ్' ప్రతినిధి బృందంతో కలిసి రాష్ట్రంలో చేపట్టే భారీ మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు, ముఖ్యంగా భారత్ ఫ్యూచర్ సిటీపై చర్చించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి 'తెలంగాణ రైజింగ్ 2047' విజన్ ను వివరించారు. 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే లక్ష్యమని చెప్పారు. భారత్ ఫ్యూచర్ సిటీ ప్రాజెక్ట్ అభివృద్ధి అవకాశాలపై సీఎం ప్రత్యేకంగా దృష్టి సారించారు. ఇది దేశంలోనే తొలి నెట్-జీరో గ్రీన్‌ఫీల్డ్ స్మార్ట్ సిటీగా రూపుదిద్దుకోనుందని తెలిపారు. సుమారు మిగతా2లో...

---



## మేడారం జాతరకు ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు

- మహిళలకు ఉచిత ప్రయాణం యధాతథం
- 51 కేంద్రాల నుంచి 4వేల బస్సులు
- రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడి

**తొలి అక్షరం/హైదరాబాద్,జనవరి 20:** మేడారం జాతరకు రాష్ట్రంలోని 51 కేంద్రాల నుంచి 4వేల బస్సులు నడిపేలా ఏర్పాట్లు చేశామని తెలంగాణ రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. మేడారానికి వెళ్లే మహిళలకు సైతం ఉచిత ప్రయాణం ఉంటుందని స్పష్టం చేశారు. రవాణా శాఖ నుంచి 10, 441 మంది సిబ్బంది విధుల్లో ఉంటారని తెలిపారు. మంగళవారం తెలంగాణ సచివాలయంలో ఆర్టీసీ అధికారులతో మంత్రి పొన్నం ప్రభాకర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. మేడారం జాతరకు మిగతా2లో...

## సిట్టు..లట్టు..పొట్టుకు భయపడం

- సిట్ ఎన్నిసార్లు పిలిచినా వెళ్తాం
- ఫోన్ ట్యాపింగ్‌లో నిరాధార ఆరోపణలు
- సింగరేణి వ్యవహారంతో దృష్టి మరల్చే కుట్ర
- దాదాపు 7 గంటలపాటు ప్రశ్నించిన సిట్
- మీడియా సమావేశంలో బిఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు



**తొలి అక్షరం/హైదరాబాద్,జనవరి 20:** కేసులు, అరెస్టులు మాకు కొత్త కాదని.. ఎన్ని కేసులు పెట్టినా ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూనే ఉంటామని మాజీ మంత్రి హరీష్ రావు అన్నారు. సిట్టు, లట్టు, పొట్టుకు మేం భయపడమని.. సిట్ ఎన్నిసార్లు విచారణకు పిలిచినా వెళ్తానని స్పష్టం చేశారు. మంగళవారం ఫోన్ ట్యాపింగ్ కేసులో విచారణ అనంతరం తెలంగాణ భవన్‌లో హరీష్ రావు మీడియాతో మాట్లాడారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో నాపై నిరాధార ఆరోపణలు చేశారని.. విచారణ పేరుతో సమయం వృధా చేశారని అన్నారు. నోటీసులు వస్తే పారిపోమని.. ఎన్ని విచారణలు అయినా ఎదుర్కొంటామన్నారు. ప్రత్యేక తెలంగాణ కోసం సమైక్య రాష్ట్రంలో ఎన్నో కేసులు ఎదుర్కొన్నామని చెప్పారు. ప్రభుత్వాన్ని విమర్శిస్తే కేసులు పెడుతున్నారని.. కేసులు, అరెస్టులు మాకు కొత్తేమి కాదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కుంభకోణాలకు నిలయంగా మారిందని.. మంత్రుల మధ్య వాటాల పంచాయతీ నడుస్తోందని ఆరోపించారు. సీఎం రేవంత్ రెడ్డి బావమరిది సింగరేణిలో మిగతా2లో...

## విశాఖపట్నం, కాకినాడ పోర్టుల్లో హైడ్రోజన్ టెర్మినల్

- ఎవల్యూషన్ సినర్జిటిక్ సంస్థతో లోకేశ్ చర్చలు



**తొలి అక్షరం/అమరావతి,జనవరి 20:** విశాఖపట్నం, కాకినాడ పోర్టుల్లో హైడ్రోజన్ టెర్మినల్ ట్రాక్టర్స్ పైలట్ వాహనాలను తయారు చేసి వినియోగించాలని కాంప్లెక్ట్ వెహికల్స్, మొబిలిటీ సిస్టమ్స్ అభివృద్ధిలో ప్రత్యేకత కలిగిన ఏఓ సంస్థను విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ కోరారు. స్పెయిన్‌కు చెందిన ఎవల్యూషన్ సినర్జిటిక్ ఆటోమోటివ్ ఎస్ఎల్ సంస్థ ఎండీ జోస్ మెల్లాడోతో మంత్రి నారా లోకేశ్ దావోస్‌లో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'ఏపీ ప్రభుత్వం గ్రీన్ హైడ్రోజన్, జీరో-ఎమిషన్ వెహికల్స్ (జడ్ఈవీ) రంగాల్లో అంతర్జాతీయ స్థాయి భాగస్వాములను మిగతా2లో...

## సింగరేణి అవినీతిలో కాంగ్రెస్, బిఆర్ఎస్‌లది సమాన వాటా...

- దానిని ఎటిఎంలా వాడుకున్న రెండు పార్టీలు
- నైనీ బ్లాక్ వివాదం మీడియాలో వచ్చిన తరవాతే రద్దు
- ఈ వ్యవహారంపై సిబిఐ విచారణ చేయించాలి
- బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు డిమాండ్



**తొలి అక్షరం/న్యూఢిల్లీ,జనవరి 20:** సింగరేణి అవినీతిలో బీఆర్ఎస్, కాంగ్రెస్‌లది సమాన పాత్ర ఉందని బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు విమర్శించారు. మంగళవారం ఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడుతూ సింగరేణిలోని నైని బ్లాక్ వివాదంపై సీబీఐ లేదంటే ఏదైనా సంస్థతో దర్యాప్తు జరపాలన్నారు. ఇది ముఖ్యమంత్రి, మంత్రుల మధ్య జరిగిన గొడవల వలనే బయటకు వచ్చింది. మీడియాలో వచ్చిన తర్వాతే నైని బ్లాక్ టెండర్లు రద్దు చేశారు. అంతకు ముందు టెండర్లు ఎందుకు రద్దు చేయలేదో భట్టి బయట పెట్టాలని ఆయన అన్నారు. ఈ మేరకు మిగతా2లో...

## చలాన్ల వసూళ్ల కోసం వేధించవద్దు

ట్రాఫిక్ పోలీసులకు హైకోర్టు ఆదేశం




2లో

## యూరియా యాప్ పై కేంద్రం ప్రశంసలు

- ఖరీఫ్ కల్లా అన్ని జిల్లాలలో యాప్ సేవలు అమలు
- సేంద్రియ, ఆర్గానిక్ వ్యవసాయాలు చేసేలా రైతులను ప్రోత్సహించాలి
- ఆర్గానిక్ పంటలకు సర్టిఫికేషన్ ఇచ్చేలా త్వరలో సర్టిఫికేషన్ యాప్
- అధికారులతో సమిక్షలో మంత్రి తుమ్మల ఆదేశం



**తొలి అక్షరం/హైదరాబాద్,జనవరి 20:** రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన యూరియా యాప్ ను కేంద్ర ఫెర్టిలైజర్ శాఖ అభినందించిందని మంత్రి తుమ్మల నాగేశ్వర రావు తెలిపారు. వచ్చే ఖరీఫ్ కల్లా ఈ యాప్ ను రాష్ట్ర వ్యాప్తంగా అమలులోకి తేవాలని అన్నారు. మంగళవారం సచివాలయంలో వ్యవసాయ, మార్కెటింగ్, కో-ఆపరేషన్ మరియు హార్టికల్చర్ శాఖల పురోగతిపై వ్యవసాయశాఖ సెక్రటరి మరియు ఆయా శాఖల డైరెక్టర్లు, ఉన్నతాధికారులతో మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వ్యవసాయ శాఖ అమలు చేస్తున్న వ్యవసాయ యాంత్రీకరణ, ప్రకృతి వ్యవసాయం మరియు తెలంగాణ విజన్ 2047 కార్యాచరణ ప్రణాళికలను మరింత సమర్థవంతంగా అమలు చేయాలని, అలాగే ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పథకాలు రైతులకు పూర్తిస్థాయిలో చేరేలా విస్తృత ప్రచారం నిర్వహించాలని అధికారులకు సూచించారు. మిగతా2లో...

# బిజెపి కొత్త సారథిగా నితిన్ నబిన్ సిన్హా

(మొదటి పేజీ తరువాయి)

నితిన్ గడ్కరీ తదితరులు హాజరయ్యారు. నితిన్ నబిన్ ఎన్నికైనట్లు పత్రాన్ని డాక్టర్ కె.లక్ష్మణ్ అందచేశారు. అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత మొదటి సారి ఆయన పార్టీ కార్యకర్తలతో సమావేశమయ్యారు. భారత్ మాతాకీ జై అంటూ తన ప్రసంగాన్ని మొదలుపెట్టిన ఆయన.. 'ముందుగా మీ అందరికీ నా హృదయపూర్వక ధన్యవాదాలు. ఒక సాధారణ కార్యకర్తనైన నన్ను పార్టీలోనే అత్యంత ఉన్నతమైన పదవికి చేరేలా చేశారు. నేను మీకు తలవంచి నమస్కరిస్తున్నాను' అని అన్నారు.జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ సిన్హా.. ప్రధాని మోదీపై ప్రశంసల జల్లులు కురిపించారు. ఆయనకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రధాని మోదీ నిరంతరంగా దేశం కోసం పాటుపడుతున్న తీరును సాధారణ కార్యకర్తలమైన తాము గమనిస్తూనే ఉన్నామన్నారు. ఆయన తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ.. 'అది నేను నేషనల్ జనరల్ సెక్రటరీగా ఉన్న సమయం. అప్పుడు మీరు(ప్రధాని మోదీ) సభావన మిషన్ ప్రోగ్రామ్ సందర్భంగా ప్రతీ ఒక్కరి కష్టాలను అడిగి తెలుసుకోవటం చూశాను. ఆ ప్రోగ్రామ్ తర్వాత మేము మీ గ్రీన్ రూములో మిమ్మల్ని కలిశాము. గుజరాత్ నుంచి చాలా మంది ఆ ప్రోగ్రామ్‌కు ఎందుకు వస్తున్నారో భావోద్వేగపూరితంగా మీరు మాకు వివరించారు. ప్రజల ఎమోషన్స్‌తో కనెక్ట్ అయ్యే వారే గొప్ప నాయకులు అవుతారని నాకు అప్పుడు అర్థమయింది' అని చెప్పారు. సందర్భంగా నితిన్ నబీన్ ప్రతిపక్షాలపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. తమిళనాడు ప్రభుత్వం తిరుప్పరన్కుంద్రం కొండపై కార్తీగై దీపం పండుగ జరగకుండా ఆపడాన్ని ఆయన తప్పుబట్టారు. సోమనాథ్, రామ సేతు, ఇతర చిహ్నాల గురించి మాట్లాడితే ప్రతిపక్ష పార్టీలు అసహనానికి గురవుతాయని అన్నారు. రామసేతు లేదు అనే వారికి, కార్తీగై దీపం పండుగను అడ్డుకునే వారికి భారత రాజకీయాల్లో చోటులేదని పేర్కొన్నారు. ప్రధాని మోదీ మాట్లాడుతూ.. నితిన్ నబీన్‌ను ప్రశంసించారు. ఇప్పుడు నబీన్ తనకు బాస్ అంటూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ.. నబీన్ తనకు బాస్ అని, తాను సాధారణ పార్టీ కార్యకర్త అని వ్యాఖ్యానించారు. 'భాజపాలో సాధారణ కార్యకర్త కూడా జాతీయ అధ్యక్షుడు కాగలరు. భాజపాలో నిర్ణయాలు, ఎంపిక అన్నీ.. ప్రజాస్వామ్యయుతంగానే ఉంటాయి. దేశసేవ, ప్రజాసేవ లక్ష్యంగా పార్టీ కార్యకర్తలు పనిచేస్తున్నారు. గతంలో ఆడ్వాణీ, వెంకయ్యనాయుడు నేతృత్వంలో ఘన విజయాలు సాధించాం. అందరి కృషితోనే మూడుసార్లు అధికారంలోకి వచ్చేలా పార్టీ ఎదిగింది. గ్రామస్థాయి నుంచి జాతీయస్థాయి వరకు పార్టీ నిర్మాణం పటిష్టంగా ఉంది. భాజపా కార్యకర్తను అనిపించుకోవడమే నాకు గర్వకారణం. భాజపాలో ప్రత్యేకంగా పదవులు, బాధ్యతలు ఇవ్వాల్సిన అవసరం లేదు. ప్రతిఒక్క కార్యకర్త స్వయంగా బాధ్యతలు తీసుకోవాలి. బాధ్యతలు ఒకరి నుంచి ఒకరికి మారతాయి.. లక్ష్యం మారదు. నాయకత్వం మారినా.. మన గమ్యం మారదు. భాజపా చేతిలోనే దేశం సురక్షితంగా ఉంటుందని ప్రజలు భావిస్తున్నారు. సేవా కార్యక్రమాల ద్వారా ప్రజలకు మరింత చేరువ కావాలని మోదీ అన్నారు. 45 ఏళ్ల నితిన్ నబీన్ కమల దళపతిగా నిన్న ఏకగ్రీవంగా ఎన్నికైన సంగతి తెలిసిందే. పార్టీ చరిత్రలోనే చిన్న వయసులో జాతీయ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన ఘనతను ఆయన సాధించారు. ఉమ్మడి బిహార్ నుంచి పార్టీ అధ్యక్ష స్థాయికి చేరిన తొలినేతగా నబీన్ నిలిచారు. ప్రమాణ కార్యక్రమానికి పలు రాష్ట్రాల నేతలు, ఎంపిలు, కేంద్రమంత్రులు హాజరయ్యారు.

# సింగరేణి అవినీతిలో కాంగ్రెస్, బిఆర్ఎస్‌లది సమాన వాటా...

(మొదటి పేజీ తరువాయి)

కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలపై రామచంద్రరావు తీవ్ర స్థాయిలో ఫైర్ అయ్యారు. నైని బ్లాక్ వ్యవహారంలో పారదర్శకత లేదు. సింగరేణి అవినీతిలో బీఆర్ఎస్ పాత్ర ఉంది. రాష్ట్రమంతా నైని కోల్ బ్లాక్ గురించి మాట్లాడుతున్నారు. సింగరేణిలో ఎప్పుడూ కూడా రాష్ట్ర ప్రభుత్వం వాటా అధికంగా ఉంటుంది. ప్రస్తుతం సింగరేణి లాభాల్లో ఉంది. నైని కోల్ బ్లాక్ అంశంతో సీఎం, డిప్యూటీ సీఎం మధ్య వివాదాలు బయటపడ్డాయి. మంత్రులు బంధువులకు కోల్ బ్లాక్ కేటాయించే ప్రయత్నం చేశారు. కిషన్ రెడ్డికి లేఖ రాసే నైతిక హక్కు బీఆర్ఎస్‌కి లేదు. బీఆర్ఎస్ సుద్ద పూసేమీ కాదు. నైని బ్లాక్‌లో ఎవరికి ఎంత ముట్టిందో చెప్పాలి. సింగరేణిలో కమిషన్ కింద కోట్లు సంపాదిస్తున్నారని రామచంద్రరావు తెలిపారు. కాంగ్రెస్ మంత్రుల మధ్య తగాదాలు అవుతున్నాయి. వారి వారి బంధువులకు కాంట్రాక్టులకు ఇవ్వడానికి పోటీ పడుతున్నారు. మరోవైపు బీఆర్ఎస్‌లో ఆస్తుల పంచాయతీ నడుస్తోంది. హరీష్ రావుకు ఒకటే చెప్తున్నా.. సుద్దపూస మాటలు మాట్లాడొద్దు. రాష్ట్రాన్ని మొదట భ్రష్టు పట్టించింది బీఆర్ఎస్.. దాన్ని కాంగ్రెస్ కొనసాగిస్తోంది. సింగరేణి ఉద్యోగులకు, ప్రజలకు బీఆర్ఎస్, కాంగ్రెస్ క్షమాపణ చెప్పాలి. స్టేట్ గవర్నమెంట్‌లో సిట్, ఇతర దర్యాప్తు సంస్థలు కూడా ఉన్నాయి. వాటితో కూడా విచారణ జరిపించాలి. బీఆర్ఎస్ ప్రభుత్వ పదేళ్ల అవినీతి, ప్రస్తుత రెండేళ్ల కాంగ్రెస్ పాలనపై కూడా అవినీతి విచారణ జరగాలని ఆయన డిమాండ్ చేశారు. కాళేశ్వరం మొత్తం రూ .లక్ష 30 వేల కోట్లు ఖర్చు చేశారు . కాళేశ్వరం గా మారిందని మేము కూడా చెప్పాం. ఫోన్ ట్యాపింగ్ కేసు రెండేళ్లుగా విచారణ జరుగుతోంది. ఈ కేసులో చాలా మంది అధికారులను అరెస్ట్ చేసినా.. రాజకీయ నాయకులను మాత్రం అరెస్ట్ చేయలేదు. ఇంకా ఫోన్ ట్యాపింగ్ కేసులో విచారణ మాత్రమే చేస్తున్నారు. హరీష్ రావును సిట్ ఎందుకు పిలవలేదు. వారి ప్రభుత్వంలోనే ఫోన్ ట్యాపింగ్ చేశారు. మునుగోడు ఎన్నికల సమయంలో బీజేపీని ఓడించేందుకే ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడ్డారని, దీని వెనుక ఉన్న అసలైన సూత్రధారులను బయటకు తీసుకురావాలన్నారు. బీఆర్ఎస్ హయాంలో జరిగిన అవినీతిపై కేంద్ర సంస్థలు ఎందుకు వేగంగా స్పందించడం లేదన్న ప్రశ్నకు ఆయన సాంకేతిక కారణాలను వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర దర్యాప్తు సంస్థలకు సహకరించకపోవడం వల్లే విచారణలో జాప్యం జరుగుతోందని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రధాని నరేంద్ర మోదీ చెప్పినట్లుగా, పశ్చిమ బెంగాల్ తర్వాత తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని రామచందర్ రావు ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలో 'డబుల్ ఇంజన్ సర్కార్' ఉంటేనే అభివృద్ధి సాధ్యమని, రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీని గెలిపించాలని ప్రజలను కోరారు. పార్టీలో ఎటువంటి విబేధాలు లేవని, 'టీమ్ బీజేపీ తెలంగాణ'గా తామంతా ఐక్యంగా ఉన్నామని ఆయన పునరుద్ఘాటించారు.

# సిట్టు..లట్టు..పొట్టుకు భయపడం

(మొదటి పేజీ తరువాయి)

వేల కోట్ల రూపాయల కుంభకోణానికి తెరతీశాడని.. ఈ స్కామ్‌ను బట్టబయలు చేసినందుకు ఫోన్ ట్యాపింగ్ కేసులో నోటీసులు ఇచ్చి డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బొగ్గు స్కాంపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. తనను అక్రమ కేసుల్లో ఇరికించేందుకు ప్రయత్నిస్తున్నారు.. ధైర్యం ఉంటే రాజకీయంగా ఎదుర్కోవాలని సవాల్ విసిరారు. దమ్ముంటే నన్ను విచారణ చేసినప్పుడు తీసిన వీడియో బైట పెట్టాలని.. అంతే కానీ చిల్లర లీకులు ఇవ్వొద్దని అన్నారు. ఇది లీకుల ప్రభుత్వం, స్కాముల ప్రభుత్వమని విమర్శలు గుప్పించారు. ప్రజలు అన్ని గమనిస్తున్నారని.. కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజలు తిరగబడే రోజులు ముందే ఉన్నాయన్నారు. ఇదిలావుంటే ఫోన్ ట్యాపింగ్ కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్యే మంత్రి హరీష్ రావు విచారణ ముగిసింది. జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో దాదాపు 7 గంటల పాటు సిట్ అధికారులు ఆయనపై ప్రశ్నల వర్షం కురిపించారు. హరీష్ రావు స్టేట్‌మెంట్ రికార్డ్ చేశారు. విచారణ ముగిసిన తర్వాత జూబ్లీహిల్స్ పీఎస్ నుంచి నేరుగా ఆయన తెలంగాణ భవన్‌కు చేరుకున్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో విచారణకు హాజరు కావాలని సోమవారం హరీష్ రావుకు సిట్ నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే. సిట్ నోటీసుల మేరకు మంగళవారం ఉదయం 11 గంటలకు జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లోని సిట్ కార్యాలయంలో ఆయన విచారణకు హాజరయ్యారు. సిట్ చీఫ్ సజ్జనార్ నేతృత్వంలో దాదాపు ఏడు గంటల పాటు అధికారులు ఆయనపై ప్రశ్నల వర్షం కురిపించారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో మీ పాత్ర ఏంటి.. ఎవరెవరి ఫోన్లు ట్యాప్ చేయించారని సిట్ ఆయనను ప్రశ్నించినట్లు సమాచారం. సిద్దిపేట ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసిన రియల్ ఎస్టేట్ వ్యాపారి చక్రధర్ గౌడ్ ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలోనే హరీశ్ రావును సిట్ విచారిస్తున్నట్టు తెలిసింది. చక్రధర్ గౌడ్ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా హరీశ్ రావు అనుచరులను పంజాగుట్ట పోలీసులు గతంలోనే అరెస్ట్ చేశారు. సిట్ కూడా వారి స్టేట్‌మెంట్లు రికార్డ్ చేసినట్టు తెలిసింది. ఐ న్యూస్ మాజీ ఎండీ శ్రవణ్ రావుతో కలిసి హరీశ్ రావు ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడినట్టు సిట్ ఆధారాలు సేకరించింది. ఈ క్రమంలోనే హరీశ్ రావుకు నోటీసులు జారీ చేసింది. కాగా, ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రధాన నిందితుడైన ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్ రావు సహా నిందితులైన మాజీ పోలీస్ అధికారుల వాంగ్మూలాలు, టెలికం సర్వీస్ ప్రొవైడర్ల నుంచి అందిన 618 నంబర్లకు చెందిన ఫోన్ ట్యాపింగ్ లిస్ట్ ఆధారంగా సిట్ దర్యాప్తు చేస్తున్నది. ఈ కేసులో బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేలు చిరుమర్తి లింగయ్య, జైపాల్ యాదవ్‌ను ఇప్పటికే విచారించింది. వాళ్ల నియోజకవర్గాల్లో ప్రత్యర్థులు సహా వ్యాపారవేత్తల ఫోన్ ట్యాపింగ్ వివరాలు సేకరించింది.

# ఫోన్ ట్యాపింగ్ దోషులకు శిక్ష తప్పదు

**● చేసిన తప్పులు కప్పిపుచ్చుకోవడానికే డ్రామాలు**

**● కెటిఆర్, హరీష్ రావుల తీరుపై మండిపడ్డ పిసిసి చీఫ్**

**తొలి అక్షరం/కామారెడ్డి,జనవరి 20:** ఫోన్ ట్యాపింగ్ కేసులో ఎంతటి వారున్నా శిక్ష తప్పదని పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. ఎవరున్నా విచారణ జరుగుతుందని అన్నారు. ఈ కేసుపై ఆయన స్పందించారు. సిట్ విచారణపై హరీశ్ రావు, కేటీఆర్ చేసిన వ్యాఖ్యలపై మహేశ్ కుమార్ మండిపడ్డారు. చేసిన తప్పు కప్పిపుచ్చుకునేందుకు డ్రామాలు చేస్తున్నారని మండిపడ్డారు. దేశంలోనే ఫోన్ ట్యాపింగ్ కేసు అతిపెద్ద నేరమని వ్యాఖ్యానించారు. టెలిగ్రాఫ్ చట్టానికి తూట్లు పొడుస్తూ తమ ఫోన్లను ట్యాప్ చేశారని ఆరోపించారు. తన ఫోన్, షబ్బీర్ అలీ సహా చాలామంది ఫోన్లు ట్యాప్ చేశారని పేర్కొన్నారు. మంగళవారం కామారెడ్డి జిల్లా కేంద్రంలో మహేష్ గౌడ్ పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతిపక్ష నేతలపై రాజకీయ వేధింపులకు పాల్పడే ఉద్దేశం సీఎం రేవంత్ రెడ్డికి లేదని ఆయన స్పష్టం చేశారు. ఇంకోసారి ఇలాంటివి జరగకుండా చట్టం తన పని తాను చేసుకుపోతుందని తెలిపారు. అలాగే బీజేపీపై టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ఫైర్ అయ్యారు. రాముడి, హిందు దేవుళ్ల పేరుతో బీజేపీ రాజకీయం చేస్తోందని.. ఎక్కడ ఎన్నికలు వచ్చిన అక్కడ హిందు, ముస్లింలకు బీజేపీ గొడవలు పెడుతుందని ఘాటు వ్యాఖ్యలు చేశారు. కేవలం ఓట్ల కోసమే బీజేపీ నాయకులు జైశ్రీరాం అంటున్నారని విమర్శించారు. నిరుపేద ప్రజలకు ఉపాధిని కల్పించాలనే సదుద్దేశంతో ఆనాడు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకానికి మహాత్మా గాంధీ పేరు తొలగించడం కరెక్ట్ కాదన్నారు. గాంధీ పేరు తొలగించడాన్ని నిరసిస్తూ జనవరి 26 తరువాత ప్రతి గ్రామంలో కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉద్యమాలు చేపట్టాలని కాంగ్రెస్ శ్రేణులకు పిలుపునిచ్చారు. రాజ్యాంగానికి వ్యతిరేకంగా కేంద్రంలోని మోడీ సర్కార్ పని చేస్తోందని నిప్పులు చెరిగారు. కాంగ్రెస్ గొప్ప పార్టీ అని.. అలాంటి పార్టీలో ఉండటం అదృష్టమని అన్నారు. కార్యకర్తల కృషి వల్లే తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో నిర్భందలు ఎదుర్కొని కాంగ్రెస్ కోసం కార్యకర్తలు కృషి చేశారని కొనియాడారు. అధికారంలోకి వచ్చిన రెండేళ్లలో అనేక సంక్షేమ పథకాలను ప్రజలకు అందజేస్తున్నామని చెప్పారు. ఇల్లు లేని పేదవారికి ఇందిరమ్మ ఇండ్లు ఇస్తున్నామని.. అలాగే ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన సదుపాయాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఇక, ప్రతి గ్రామంలో సర్పంచు లు ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. ప్రభుత్వ పాలనలో సర్పంచులదే మూడో స్థానమన్నారు.



# చలాన్ల వసూళ్ల కోసం వేధించవద్దు

**● ట్రాఫిక్ పోలీసులకు హైకోర్టు ఆదేశం**

**తొలి అక్షరం/హైదరాబాద్,జనవరి 20:** వాహన చలాన్లపై వాహనదారులను వేధింపులకు గురి చేయవద్దని ట్రాఫిక్ పోలీసులకు తెలంగాణ హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. పెండింగ్ చలాన్ల కోసం వాహనదారులను బలవంతం చేయవద్దని తేల్చి చెప్పింది. వాహనాల తాళాలు లాక్కోవడం, సీజ్ చేయడం సరికాదదంది. స్వచ్ఛందంగా చెల్లిస్తేనే చలాన్లు వసూలు చేయాలని, లేకపోతే నోటీసులు ఇవ్వాలని హైకోర్టు ఆదేశించింది. కాగా.. గత సంవత్సరం సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ట్రాఫిక్ ఉల్లంఘనలకు సంబంధించి రూ.239.37 కోట్ల చలాన్లు విధించారు. ఇందులో వాహనాలను ఆపి ట్రాఫిక్ పోలీసులు విధించిన చలాన్లు 10,27,335 ఉండగా, ఈ-చలాన్లు 25,93,152 ఉన్నాయి. ఈ రెండు రకాల చలాన్ల మొత్తం విలువ రూ. 239.37 కోట్లు అని వార్షిక నివేదిక ద్వారా వెల్లడైంది. కొద్దిరోజుల క్రితం యూసుఫ్‌గూడలోని కోట్ల విజయభాస్కర్‌రెడ్డి ఇండోర్ స్టేడియంలో రహదారి భద్రత మాసోత్సవాల్లో భాగంగా అరైవ్-అలైవ్ పేరుతో ప్రచార కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించే వాహనదారులకు పోలీసులు చలానాలు వేయగానే.. వారి బ్యాంకు ఖాతా నుంచి ఆ మొత్తం ఆటోమెటిక్‌గా చెల్లింపు జరిగిపోయేలా సరికొత్త వ్యవస్థను తీసుకురావాల్సిన అవసరముందని చెప్పారు.

# భారత్ ఫ్యూచర్ సిటీ అభివృద్ధికి తోడ్పాటు

(మొదటి పేజీ తరువాయి)

30 వేల ఎకరాల్లో విస్తరించే ఈ నగరంలో ఏఐ, విద్య, ఆరోగ్యం, పరిశ్రమలు, నివాస, వినోద రంగాలకు ప్రత్యేక జోన్లు ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. ఈ ప్రాజెక్ట్ లో ఇప్పటికే మారుబేని, సెమ్ కార్ప్ వంటి అంతర్జాతీయ సంస్థలు భాగస్వాములుగా ఉన్నాయని, ఇటీవలే రిలయన్స్ గ్రూప్ వంతారాతో ఫ్యూచర్ సిటీలో కొత్త జూ ఏర్పాటు కోసం అవగాహన ఒప్పందం కుదిరిందని సీఎం వెల్లడించారు. తెలంగాణతో వ్యూహాత్మక భాగస్వామ్యం ఏర్పాటుకు తమ ప్రభుత్వం ఆసక్తిగా ఉందని అబ్దుల్లా బిన్ తౌక్ అల్ మార్రీ తెలిపారు. ప్రాజెక్ట్ వేగవంతమయ్యేందుకు రెండు ప్రభుత్వాల అధికారులతో సంయుక్త టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. యూఏఈ ఫుడ్ క్లస్టర్‌తో తెలంగాణ కలిసి పనిచేసి గ్రామీణ, వ్యవసాయ ఆధారిత ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయాలన్న ఆకాంక్షను వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో తెలంగాణ తరఫున ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తదితర అధికారులు పాల్గొన్నారు.

# మేడారం జాతరకు ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు

(మొదటి పేజీ తరువాయి)

ఆర్టీసీ సన్నద్ధతపై అధికారులకు దిశానిర్దేశర చేశారు. ఈ సమావేశంలో స్పెషల్ సీఎస్ వికాస్‌రాజ్, ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి, ఆర్టీసీ ఈడీలు, ఆర్ఎంలు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడారు. మేడారం విధుల్లో 7వేల మంది డ్రైవర్లు - 18 మంది కండక్టర్లు, 800 మంది సెక్యూరిటీ సిబ్బంది పనిచేస్తారని మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. 28వ తేదీ నుంచి 1వ తేదీ వరకు స్పెషల్ బస్సులు నడుపుతామని చెప్పుకొచ్చారు. మేడారం వెళ్లేటప్పుడు బస్సులు నిండుతాయని... వచ్చేటప్పుడు ఖాళీగా బస్సులు వస్తాయని తెలిపారు. వన్ వేలో బస్సులు ఖాళీగా వెళ్తాయి కాబట్టి... రెగ్యులర్ ఛార్జీల కంటే 50శాతం అదనపు ఛార్జీలు వసూలు చేస్తారని పేర్కొన్నారు. ఆర్టీసీ బస్సుల్లో 20 లక్షల మంది ప్రయాణిస్తారని అంచనా వేస్తున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. మేడారంలో 50ఎకరాల్లో వెయ్యి బస్సులు నిలిపేలా తాత్కాలిక బస్ షెల్టర్స్‌ను ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు. నిమిషానికి నాలుగు బస్సులు వెళ్లేలా ఏర్పాట్లు చేశామని వివరించారు. బస్ షెల్టర్ల వద్ద 9 కిలోమీటర్ల మేర 50 క్యూ లైన్స్ ఏర్పాటు చేశామని అన్నారు. బస్టాండ్స్‌లో క్లోజ్డ్ సర్క్యూట్, సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని.. వీటిని కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానం చేశామని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.

# యూరియా యాప్ పై కేంద్రం ప్రశంసలు

(మొదటి పేజీ తరువాయి)

సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఆర్గానిక్ పంటలు పండిస్తున్నప్పటికి, మార్కెట్లో నకిలీ ఆర్గానిక్ లేబుల్లతో నకిలీ ఉత్పత్తులు చలామణీ అవుతున్నందున నిజమైన ఆర్గానిక్ పంటలు పండించే రైతులకు నష్టం చేకూరుతుందని మంత్రిగారు అన్నారు. ఇందుకోసం వ్యవసాయశాఖ ఆర్గానిక్ ఉత్పత్తులకు సర్టిఫికేషన్ ఇచ్చే విధంగా ఒక యాప్ తీసుకురానుందని అన్నారు. ఈ యాప్ ద్వారా కొనుగోలుదారు తాను కొనబోయే ఉత్పత్తి ఎక్కడ, ఏ రైతు, ఎలా పండించాడో తెలుసుకుంటాడని అన్నారు. అదేవిధంగా అగ్రివర్సిటీలలోని ఖాళీ ప్రదేశాలలో ఆర్గానికి పంటలు పండించి, అక్కడే స్టాల్స్ పెట్టి అమ్మినట్లైతే రైతులు ఆర్గానిక్ పంటలవైపు వెళ్లే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని అన్నారు. ప్రభుత్వం పునరుద్ధరించిన వ్యవసాయ యాంత్రీకరణ పథకంలో భాగంగా ఇప్పటికే 50 కోట్లు ఖర్చు చేశామని, ఇంకా 50 కోట్లు ఖర్చు చేయడానికి సిద్ధంగా ఉన్నామని అన్నారు రైతులకు కావాల్సిన యంత్రాలు మార్కెట్ ధరలకే లభించేలా, ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీ నేరుగా రైతులకు చేరేలా నిబంధనలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ప్రతి పైసను పూర్తిగా సద్వినియోగం చేసుకునేలా ప్రణాళికలు వేసుకోవాలని, కేంద్రం నుంచి వచ్చే ఒక్క పైసా కూడా వృథాగా తిరిగి వెళ్లకూడదని అధికారులకు సూచించారు. చ్చే ఖరీఫ్ నాటికి పెద్దమొత్తంలో యూరియా బఫర్ స్టాక్ లను నిల్వలో ఉంచుకోవాలని, భవిష్యత్తులో యూరియా ఇబ్బందులు రాకుండా చూసుకోవాలని, రైల్వే రేక్ పాయింట్లను కూడా ఎరువుల పంపిణీకి తగ్గట్లుగా ఉండేలా, మరికొన్ని రైల్వేరేక్ పాయింట్లను అదనంగా ఏర్పాటు చేసేవిధంగా రైల్వే అధికారులను కోరాలని సూచించారు.

# బైంసాలో ఘోర రోడ్డు ప్రమాదం

**● కారును ఢీకొన్న కంటెయినర్ ● ప్రమాదంలో నలుగురు దుర్మరణం**

**తొలి అక్షరం/నిర్మల్,జనవరి 20:** నిర్మల్ జిల్లా భైంసా పట్టణంలో మంగళవారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. భైంసా బస్ డిపో సమీపంలో కారు- కంటైనర్ లారీ ఢీకొన్నాయి. ఈ దుర్ఘటనలో కారులో ప్రయాణిస్తున్న నలుగురు వ్యక్తులు అక్కడికక్కడే మృతి చెందారు. ఇద్దరి పరిస్థితి విషమంగా ఉందని సమాచారం. మృతులు నిర్మల్ జిల్లా కుబేర్ మండలం కుప్టి గ్రామానికి చెందిన వారిగా తెలుస్తోంది. మృతుల్ని బాబన్న, భోజరాం పటేల్, రాజన్న, వికాస్‌గా గుర్తించారు. ఈ నలుగురు హైదరాబాద్ నుంచి తిరిగి స్వగ్రామానికి వెళ్తుండగా ప్రమాదం జరిగినట్టు తెలుస్తోంది. కారు అదుపుతప్పి కంటైనర్‌ను ఢీకొనడంతో ప్రమాదం జరిగినట్టు ప్రాథమిక సమాచారం. రోడ్డుపై రాకపోకలకు ఆటంకం కలిగింది. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాలను పోస్ట్‌మార్టం నిమిత్తం తరలించారు. గాయపడిన వారిని సమీప ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

# విశాఖపట్నం, కాకినాడ పోర్టుల్లో హైడ్రోజన్ టెర్మినల్

(మొదటి పేజీ తరువాయి)

బలోపేతం చేసేందుకు ఆసక్తిగా ఉంది. రాష్ట్రంలోని పారిశ్రామిక పార్కులు, పోర్టులు, ఇంజినీరింగ్ శాండ్ బాక్స్‌లను అందిస్తూ ఏపీ గ్రీన్ ఎనర్జీ లక్ష్యాలను సాకారం చేయబోతోంది. ఏపీ పారిశ్రామిక పార్కుల్లో ఎలక్ట్రిక్/హైడ్రోజన్ ఆఫ్ రోడ్ వాహనాల కోసం కో-పైలట్‌ను అభివృద్ధి చేసి, రీడిజైన్, ఆప్టిమైజేషన్‌కు నేతృత్వం వహించండి. ఇందుకు అవసరమైన టెస్ట్ బెడ్‌లు, అనుమతులను ఏపీ ప్రభుత్వం అందిస్తుంది. ఏపీ ప్రారంభ దశ ఆవిష్కరణలను ప్రోత్సహించాలని భావిస్తోంది. ప్రొటో టైప్ అభివృద్ధికి, ఇంజినీర్ల శిక్షణకు ఏపీ ప్రభుత్వం సహకరిస్తుంది. ఇండస్ట్రియల్ లేదా అడమిక్ క్యాంపస్‌లో చిన్న ఇంజినీరింగ్ శాండ్ బాక్స్‌లను అందిస్తుందని తెలిపారు.

# ఉపాధి ఉసురు తీసే 'వీబీజీ రామ్ జీ'ని రద్దు చేయాలి







**● మహాత్మా గాంధీ పేరు తొలగించడం దుర్మార్గం ● రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు,రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్ చల్లా నరసింహారెడ్డి ● కేంద్రంపై రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ నిప్పులు ● మోడీ దిష్టిబొమ్మ దహనం**

**తొలి అక్షరం/రాష్ట్ర ప్రతినిధి(పి.సైదులు),జనవరి20:** మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని (ఎంజీఎన్ఆర్ఈజీఎ) నీరుగార్చి,పేద కూలీల నోట్లో మట్టి కొట్టేలా కేంద్రంలోని మోడీ ప్రభుత్వం తీసుకువచ్చిన 'వీబీజీ రామ్ జీ' చట్టాన్ని తక్షణమే రద్దు చేయాలని రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు,రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్ చల్లా నరసింహారెడ్డి డిమాండ్ చేశారు.ఏఐసీసీ, టీపీసీసీ పిలుపు మేరకు మంగళవారం రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండల పరిధిలోని ఆలూరు గ్రామంలో జిల్లా కాంగ్రెస్ ఆధ్వర్యంలో భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాని మోడీ దిష్టిబొమ్మను దహనం చేసి కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేక నినాదాలు చేశారు.అనంతరం చల్లా నరసింహారెడ్డి మాట్లాడుతూ..దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన మహాత్మా గాంధీ పేరును తొలగించి, ఆ స్థానంలో ఆర్ఎస్ఎస్ భావజాలంతో కొత్త చట్టాలను తీసుకురావడం ప్రజాస్వామ్యానికే గొడ్డలిపెట్టు అని ఆయన అన్నారు.ఎంజీ నరేగా స్థానంలో తీసుకువచ్చిన 'వికసిత్ భారత్ గ్యారంటీ రోజ్ గార్ అండ్ ఆజీవికా మిషన్' (వీబీజీ-రామ్ జీ) చట్టం కేవలం రాష్ట్రాలపై భారం వేయడానికే అని అన్నారు.ఈ కొత్త నిబంధనల వల్ల తెలంగాణ రాష్ట్రంపై అదనంగా రూ. 2వేల కోట్ల భారం పడుతోంది అని తెలిపారు.పనులపై 60 రోజుల నిషేధం విధించడం వల్ల కూలీలకు ఉపాధి కరువై ఆత్మహత్యలకు దారితీసే ప్రమాదం ఉంది అని మండిపడ్డారు. **బీఆర్ఎస్ తీరుపై విమర్శలు:** కేంద్రం ఇంతటి దుర్మార్గపు చట్టాన్ని తెచ్చినా, రాష్ట్రంలోని ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ నోరు మెదపకపోవడం వారి చేతకానితనానికి నిదర్శనమని ఎద్దేవా చేశారు.వెంటనే కేంద్రం ఈ నూతన చట్టాన్ని ఉపసంహరించుకోవాలని, లేనిపక్షంలో ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. చేవెళ్ల ఇంచార్జ్ భీమ్ భరత్, ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ జ్ఞానేశ్వర్,టీపీసీసీ ఉపాధ్యక్షులు వేణు గౌడ్,పంచాయతీ రాజ్ సంఘటన్ కన్వీనర్ రాచమల్ల సిద్దేశ్వర్,పీసీబీ మెంబెర్ సత్యనారాయణ రెడ్డి,మాజీ జెడ్పీ చైర్మన్ తీగల అనితారెడ్డి,మండల పార్టీ అధ్యక్షుడు వీరేందర్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్లు పెంటయ్య గౌడ్,సురేందర్ రెడ్డి మరియు భారీ సంఖ్యలో కాంగ్రెస్ నాయకులు,ఉపాధి కూలీలు పాల్గొన్నారు.



రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు, రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్ చల్లా నరసింహారెడ్డి

# రుక్మిణి సత్యభామ & వేణుగోపాల స్వామి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలి: ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

**కన్నుల పండువగా రుక్మిణి సత్యభామ & వేణుగోపాల కళ్యాణోత్సవం**

**కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ రెడ్డి, ఎంపీపీ శివశంకర్ గౌడ్ తదితరులు**





**తొలి అక్షరం/షాద్ నగర్, జనవరి 20:** రంగారెడ్డి జిల్లా ఫరూక్‌నగర్ మండల పరిధిలోని దేవునిపల్లి గ్రామంలో వెలసిన శ్రీ రుక్మిణి సత్యభామ సమేత శ్రీ వేణుగోపాల స్వామి దేవస్థానాన్ని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రంగాల సంస్థల చైర్మన్, షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్ల పల్లి శంకర్ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.వేణుగోపాల స్వామి కళ్యాణ మహోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ రెడ్డి, ఉమ్మడి కొత్తూరు మాజీ ఎంపీపీ శివశంకర్ గౌడ్, పార్టీ సీనియర్ నేతలు కాశీనాథ్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, శ్యాంసుందర్ రెడ్డి, బాలరాజ్‌లు హాజరయ్యారు. గ్రామ సర్పంచ్ కుర్వ లలిత మల్లేష్ అతిథులకు ఘన స్వాగతం పలికి ఆలయ ప్రాంగణంలోకి ఆహ్వానించారు.ఆలయ పూజారులు ఎమ్మెల్యే శంకర్‌తో పాటు అతిథులకు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్ల పల్లి శంకర్ మాట్లాడుతూ దేవునిపల్లి గ్రామంలో వెలసిన శ్రీ రుక్మిణి సత్యభామ సమేత శ్రీ వేణుగోపాల స్వామి దేవస్థానం ఎంతో పురాతనమైనదని, భక్తుల మనోభావాలకు, గ్రామ ప్రజల ఆధ్యాత్మిక విశ్వాసాలకు ఇది కేంద్రబిందువుగా నిలుస్తోందని అన్నారు. ఇలాంటి చారిత్రక దేవాలయాల అభివృద్ధికి ప్రభుత్వం అన్ని విధాలుగా సహకరిస్తుందని తెలిపారు. ఆలయ అభివృద్ధి పనులకు అవసరమైన నిధులు మంజూరు చేయించి, మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.వేణుగోపాల స్వామి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని, గ్రామం సుభిక్షంగా ఉండాలని, సకల సర్వ విజయాలు ప్రాప్తి కలగాలని, పాడిపంటలు సమృద్ధిగా పండాలని దేవుడిని ప్రార్థిస్తూ ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు తెలిపారు.మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూడదేవునిపల్లి వేణుగోపాల స్వామి దేవాలయం చారిత్రక ప్రాధాన్యం కలిగినదని, ఇక్కడ నిర్వహించే బ్రహ్మోత్సవాలు, కళ్యాణ మహోత్సవాలు ఎంతో వైభవంగా జరుగుతాయని అన్నారు. భవిష్యత్తులో ఆలయాన్ని మరింత అభివృద్ధి చేసి, భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పాలక వర్గం సభ్యులు, గ్రామ పెద్దలు, నాయకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మీ ఆనందం ఒక గ్లాస్.. మరొకరి జీవితం శూన్యం

**● నిజాంపేట్ సెంటర్‌లో డ్రంక్ అండ్ డ్రైవ్‌పై గట్టి హెచ్చరిక**

**● చట్ట భయం కాదు.. ప్రాణ విలువ తెలుసుకోవాలి: ట్రాఫిక్ ఎస్ఐ సత్యానందం**

**● ప్రమాదాల నివారణే లక్ష్యం ప్రజలకు అవగాహన కల్పించిన ట్రాఫిక్ పోలీసులు**




**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో సాంబ జనవరి 20:** డ్రంక్ అండ్ డ్రైవ్ కారణంగా జరుగుతున్న రోడ్డు ప్రమాదాలను నివారించాలనే ఉద్దేశంతో మియాపూర్ ట్రాఫిక్ ఎస్ఐ సత్యానందం ఆధ్వర్యంలో నిజాంపేట్ సెంటర్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం ప్రజల్లో రహదారి భద్రతపై చైతన్యం కల్పించేలా సాగింది.ఈ సందర్భంగా ఎస్ఐ సత్యానందం మాట్లాడుతూ, మద్యం సేవించి వాహనం నడపడం క్షణిక ఆనందం కోసం జీవితాలను ప్రమాదంలో పడేయడమేనని హెచ్చరించారు. మత్తులో తీసుకునే ఒక్క నిర్ణయం అనేక కుటుంబాలను శాశ్వత దుఃఖంలోకి నెట్టేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు.ట్రాఫిక్ పోలీసులు శిక్షించడానికి కాదు, ప్రజల ప్రాణాలను కాపాడేందుకే విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. మద్యం సేవించిన అనంతరం వాహనం నడపకుండా ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకోవాలని, ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ బాధ్యతాయుత పౌరులుగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు.

# ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై నల్లగొండ ఎస్పీకి బిఆర్ఎస్ పార్టీ నాయకుల ఫిర్యాదు

**తొలి అక్షరం/రామన్నపేట జనవరి 20:** నల్లగొండ జిల్లా బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు.. జిల్లా ఎస్పీ ని వారి కార్యాలయంలో కలిసి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి .. బిఆర్ఎస్ పార్టీలో ఆందోళన కలిగించే విధంగా శాంతి భద్రతలకు విఘాతం కల్పించే రీతిలో, తెలంగాణ తొలి ముఖ్య మంత్రి కెసిఆర్ ని, బిఆరెస్ పార్టీ నాయకులను కార్యకర్తలను అవమానపరిచే విధంగా... బిఆర్ఎస్ పార్టీని బొంద పెట్టమని, పార్టీ జెండా దిమ్మెలు కూల్చివేయాలని వ్యాఖ్యానించడం పట్ల ఫిర్యాదు చేస్తూ. ప్రజాస్వామ్యాని కే విఘాతం కలిగించేలా వారి వ్యాఖ్యలు ఉన్నందువలన, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు పత్రాన్ని అందచేశారు. ఎస్పీ ని కలిసిన వారిలో.. శాసన మండలి సభ్యులు మంకెన కోటిరెడ్డి, జడ్పి మాజీ చైర్మన్ బండా నరేందర్ రెడ్డి, మాజీ శాసనసభ్యులు కంచర్ల భూపాల్ రెడ్డి, నల్లమోతు భాస్కరరావు, నోముల భగత్ కుమార్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షులు రేగట్టే మల్లికార్జున రెడ్డి నల్లగొండ మున్సిపల్ మాజీ చైర్మన్ మందడి సైదిరెడ్డి,పట్టణ పార్టీ అధ్యక్షులు భువనగిరి దేవేందర్, కొండూరు సత్యనారాయణ సయ్యద్ జాఫర్ జమల్ ఖాద్రి తదితరులు ఉన్నారు.



# వాసవీ మాత ఆత్మార్పణ దినోత్సవం





**తొలి అక్షరం/మేడిపల్లి: జనవరి 20:** ఆర్య వైష్యుల ఆరాధ్య దైవమైన వాసవీ కన్యకా పరమేశ్వరి మాత ఆత్మార్పణ దినోత్సవాన్ని మేడిపల్లి మండలంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పర్వతపూర్ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో శ్రీ మహా గణపతి నవగ్రహ సహిత లలిత సహస్ర నామ పూర్వక యజ్ఞం, సామూహిక కుంకుమార్చన , అన్నదానం నిర్వహించారు. మేడిపల్లి ఆర్య వైశ్య సంఘం లో వాసవి మాత చిత్ర పటానికి నివాళులార్పించి పూజలు చేశారు.

# నియమాలు పాటించండి.. సురక్షితంగా ఇల్లు చేరండి..

**- మేడిపల్లి సీఐ గోవింద్ రెడ్డి**




**తొలి అక్షరం /మేడిపల్లి/జనవరి 20:** వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించి సురక్షితంగా ఇంటికి చేరుకోవాలని మేడిపల్లి సీఐ గోవిందరెడ్డి అన్నారు. జాతీయ రోడ్డు భద్రత మాస ఉత్సవాల్లో భాగంగా మంగళవారం చెంగిచెర్ల చౌరస్తా సమీపంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గోవింద్ రెడ్డి మాట్లాడుతూ... మద్యం తాగి వాహనాలు నడపడం వల్ల మనం ప్రమాదాలకు గురి కావడంతో పాటు తోటి ప్రయాణికులను సైతం ప్రమాదంలో పడేస్తామని, మద్యం మత్తులో విలువైన ప్రాణాలు పోగొట్టుకుని కుటుంబాలను అనాధలుగా మారుస్తున్నామని అన్నారు. ప్రతి వాహనదారులు హెల్మెట్ ధరించాలని వాహనాలు నడిపే సమయంలో విధిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని అప్పుడే ప్రమాద రహిత ప్రయాణాలు సాధ్యమవుతాయని వివరించారు. ఈ సందర్భంగా వాహనదారులతో రోడ్ సేఫ్టీ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు నర్సింగరావు, ఉదయభాస్కర్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు

# ఇంద్రపాలనగరంలో క్లస్టర్ సీఎం కప్ ఆటల పోటీలను ప్రారంభించిన సర్పంచ్ గర్ధాస్ విక్రమ్



**తొలి అక్షరం/రామన్నపేట జనవరి 20:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సీఎం కప్ పాటల పోటీలను ఇంద్రపాలనగరం సర్పంచ్ గర్దాసు విక్రమ్ గ్రామంలో ప్రారంభించారుఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ నల్ల జయసుధ స్వామి ,వార్డ్ మెంబెర్ లు,పంచాయతీ సెక్రటరీ రసూల్ ప్రధానోపాధ్యాయులు, ఫిజికల్ డైరెక్టర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, యువకులు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

# దశదిన కార్యక్రమంలో పాల్గొన్న దైద రవీందర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి



**తొలి అక్షరం/రామన్నపేట జనవరి 20:** నియోజవర్గ కేంద్రం చీమలగడ్డ కు చెందిన బుడిగె లక్ష్మమ్మ ఇటీవల మరణించగా వారి దశదిన కార్యక్రమంలో వారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన దైద రవీందర్ తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శిసతీష్,గిరి, లింగయ్య,శంకర్,లింగస్వామి, నక్షత్,రాజశేఖర్, పరమేష్ ,శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## రామన్నపేట మండలం వెల్లంకి గ్రామంను సందర్శించిన ఆదిత్య ప్రకాష్ ఐఏఎస్ అడిషనల్ సెక్రటరీ, పంచాయతీ రాజ్ బీహార్






**తొలి అక్షరం/రామన్నపేట జనవరి 20:** గ్రామ పంచాయతీ కార్యాలయం, రైతు వేదిక, స్మశాన వాటిక, పల్లె ప్రకృతి వనం, నర్సరీ తదితర పనులను పరిశీలించినారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న పనులు సంతృప్తి కరంగా ఉన్నాయి అన్నారు. జాన్ వెస్లీ డిప్యూటీ కమీషనర్, పంచాయతీ రాజ్, విష్ణువర్ధన్ రెడ్డి జిల్లా పంచాయతీ అధికారి సురేష్ అడిషనల్ జిల్లా గ్రామీణభివృద్ధి అధికారి, రావుఫ్ అలీ మండల పంచాయతీ అధికారి, ఇడం రాధ సర్పంచ్, సందీప్ రెడ్డి వెంకన్న ప్రవీణ్ , మోహన్ పంచాయతీ కార్యదర్శి, సుచరిత, వార్డ్ మెంబర్స్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పట్టణాన్ని అన్ని అంగులతో సుందరీకరించడమే ప్రభుత్వ లక్ష్యం

**- 26,2&3 వార్డులో రూ.. 1కోటి72లక్షల వ్యయం తో అభివృద్ధి పనులకు శాసనసభ్యులు మురళీ నాయక్ ,డీసీసీ అధ్యక్షురాలు ఉమా మురళి నాయక్ శంకుస్థాపన..**



**తొలి అక్షరం/మహబూబాబాద్ బ్యూరో జనవరి 20:** మానుకోట పట్టణాన్ని అన్ని అంగులతో సుందరీకరించడమే ప్రభుత్వ లక్ష్యమని శాసనసభ్యులు వైద్యులు భూక్యా మురళి నాయక్ అన్నారు. పురపలక సంఘ పరిధిలోని వివిధ వార్డుల్లో రూ. 1కోటి 72 లక్షల రూపాయల విలువైన అభివృద్ధి పనులకు మంగళవారం శాసనసభ్యులు వైద్యులు భూక్యా మురళి నాయక్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు, మాజీ పురపాలక సంఘ చైర్ పర్సన్ భూక్య ఉమా మురళి నాయక్ లు శంకుస్థాపన చేశారు. శాసనసభ్యులు వైద్యులు మురళీ నాయక్ మాట్లాడుతూ, మానుకోటను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. అభివృద్ధి పనుల్లో నాణ్యతకు ప్రాధాన్యం ఇస్తూ, కేటాయించిన ప్రతి రూపాయిని ప్రజల మేలు కోసం వినియోగిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు రవీంద్ర చారి, సుదర్శన చారి, పాపా చారి, లింగస్వామి, ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## గంజాయి అక్రమ రవాణా చేస్తున్న యువకుని అరెస్ట్.. పట్టణ ఎస్ హెచ్ ఓ గట్ల మహేందర్ రెడ్డి



**తొలి అక్షరం/మహబూబాబాద్ బ్యూరో జనవరి 20:** గంజాయి అక్రమ రవాణా చేస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు పట్టణ స్టేషన్ హౌస్ ఆఫీసర్ గట్ల మహేందర్ రెడ్డి తెలిపారు. మంగళవారం పట్టణ పోలీస్ స్టేషన్లో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన వివరాలు తెలియజేస్తూ గతవారం నమోదుచేసిన గంజాయి అక్రమ రవాణా కేసులో మూడవ నిందితుడైన కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం అలుగునూరు గ్రామానికి చెందిన డాకురి నవీన్, కొమురయ్య, 32 సం,,అనే వ్యక్తిని పట్టణ పోలీసులు అరెస్టు చేసినట్లు తెలిపారు. సోమవారం సాయంత్రం మూడుకోట్ల సెంటర్ లో వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా అనుమానితుడైన వ్యక్తిని విచారించగా, అతనికి కూడా నేరంలో ప్రమేయం ఉన్నట్లు ఒప్పుకున్నాడు, నిందితుని వద్ద నుంచి ఒక మొబైల్ ఫోన్ TS16FD6906 నెంబర్ గల జుపిటర్ స్కూటీని స్వాధీనం చేసుకుని జ్యుడిషియల్ కస్టడీ కి తరలించినట్లు తెలిపారు.

# ఫార్మర్ రిజిస్ట్రేషన్ తప్పనిసరి


**● మండల వ్యవసాయ అధికారి వెల్లడి ● నాగులపల్లి గ్రామంలో రైతులకు అవగాహనా కల్పించిన ఏవో నిశాంత్ కుమార్**




**తొలి అక్షరం/ఫరూక్ నగర్,జనవరి 20:** కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు అందిస్తున్న పథకాలను ప్రతి ఒక్క రైతులు ఉపయోగించుకోవాలని సూచించారు ఫరూక్ నగర్ మండల వ్యవసాయ అధికారి నిశాంత్ కుమార్...మంగళవారం మండల పరిధిలోని నాగులపల్లి గ్రామంలో సర్పంచ్ రాధికా అశోక్ రెడ్డి,గ్రామ పంచాయతీ కార్యదర్శి హరి ఆధ్వర్యంలో రైతులకు ప్రభుత్వాల నుండి లభించే పథకాలపై అవగాహనా కల్పించారు.ఇందులో భాగంగా గ్రామంలో ఉన్న ప్రతి ఒక్క రైతు తమ భూమి పట్టా పాస్బుక్, ఆధార్ కార్డు మరియు ఆధార్ కార్డుకు లింకైనా మొబైల్ నెంబర్ తో అందుబాటులో ఉన్న మీసేవా గాని లేదా సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారి దగ్గర గాని సంప్రదించి రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు.తద్వారా కేంద్ర,రాష్ట్రాల నుండి వచ్చే ప్రభుత్వ పథకాలు నేరుగా రైతులకు అందటానికి అవకాశం ఉంటుందన్నారు.అన్నదాతలకు పెట్టుబడి సాయం అందించడంతో పాటు,పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించేందుకు ప్రభుత్వాలు,అధికారులు చిత్తశుద్ధితో పనిచేస్తుందన్నారని తెలిపారు.ఏదైనా సందేహాలు ఉంటే అందుబాటులో ఉన్న వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి నిశాంత్ కుమార్ తో పాటు ఏఈవో తేజ్ కుమార్,రైతులు పాల్గొన్నారు.

## మోడల్ స్కూల్లో ప్రవేశ పరీక్ష కొరకు దరఖాస్తులకు ఆహ్వానం

**● నెక్కొండ మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ యమ్, ప్రణయ్ కుమార్**




**తొలి అక్షరం/నెక్కొండ జనవరి 20:** వరంగల్ జిల్లా నెక్కొండ మండల పరిధిలోని నెక్కొండ తండా యందుగల తెలంగాణ ఆదర్శ పాఠశాలలో ఆరవ తరగతి నుండి పదవ తరగతి వరకు 2026 -2027 విద్యా సంవత్సరానికి గాను ప్రవేశ పరీక్షల కొరకు ఈనెల 28వ తేదీ నుండి ఫిబ్రవరి 28వ తేదీ వరకు ఆన్లైన్లో దరఖాస్తులు చేసుకోగలరు.ఆరవ తరగతిలో అన్ని సీట్లకు మరియు ఏడవ తరగతి నుండి పదవ తరగతి వరకు ఖాళీగా ఉన్న సీట్లు భర్తీ కొరకు అర్హత గల విద్యార్థిని,విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఏప్రిల్ 9న తారీకు నుండి హాల్ టికెట్స్ ను ఇవ్వబడును. ఏప్రిల్ 19న తేదీన మోడల్ స్కూల్లో ప్రవేశ పరీక్ష నిర్వహించబడును, కావున అర్హతగల విద్యార్థిని విద్యార్థులు ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోగలరు. ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకొను ఓసి విద్యార్థిని,విద్యార్థులకు రూపాయలు 200 లు, ఇతరులకు రూపాయలు 125,/బి చెల్లించాల్సి ఉంటుంది. ప్రవేశాలకు సంబంధించిన పూర్తి వివరాలకు పాఠశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం, ప్రణయ్ కుమార్ ను సంప్రదించాల్సిందిగా ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

## గంగుల నాచారం క్లస్టర్ సీఎం కప్ పోటీలు ప్రారంభోత్సవం

**● రేపల్లెవాడ సర్పంచ్ అజ్మీర సురేష్ నాయక్ ● గ్రామీణ ప్రతిభకు గ్లోబల్ వేదిక సీఎం కప్ ● గ్రామీణ స్థాయి నుంచి ప్రపంచ స్థాయి వరకు అనే నినాదంతో ఈ క్రీడాలను రూపొందించారు**



**తొలి అక్షరం/ఏన్కూర్ జనవరి 21:** ఏన్కూరు మండలం గంగుల నాచారం క్లస్టర్ రేపల్లెవాడ మేడేపల్లి గంగుల నాచారం నాచారం గ్రామ పంచాయతీలకు సంబంధించి సీఎం కప్ ఆటల పోటీలు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని రేపల్లెవాడ సర్పంచ్ అజ్మీర సురేష్ నాయక్ చేతులమీదుగా ప్రారంభించడం జరిగింది గ్రామస్థాయి, మండల స్థాయి నియోజకవర్గస్థాయి, జిల్లాస్థాయి, రాష్ట్రస్థాయి గ్రామస్థాయిలో విజేతలను మండల స్థాయికి అక్కడి నుంచి అసెంబ్లీ నియోజకవర్గం జిల్లా చివరకు రాష్ట్రస్థాయి కి ఎంపిక చేస్తారు రేపల్లెవాడ సర్పంచ్ అజ్మీర సురేష్ నాయక్ మాట్లాడుతూ యువతల్లో క్రీడలపై అవగాహన పెంచేందుకు రాష్ట్రంలోని అన్ని మండలాల కేంద్రాల్లో క్రీడలను ప్రారంభించారు యువ క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు పల్లె ప్రతిభను గుర్తించడమే లక్ష్యం గా గ్రామీణ ప్రాంతాల నుంచి ప్రతిభావంతులైన క్రీడాకారులను గుర్తించి అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లడమే సీఎం కప్ లక్ష్యమని 2036 ఒలంపిక్స్ లో తెలంగాణకు గర్వకారణంగా నిలిచే క్రీడాకారులను తయారు చేయాలన్నదే రాష్ట్ర ప్రభుత్వం సంకల్పం అని చెప్పారు గత ఏడాది సీఎం కప్ ఘనవిజయాన్ని సాధించిందని అదే స్ఫూర్తితో యువకులు క్రీడా స్ఫూర్తిని పెంపొదించుకోవాలని కొనియాడారు ఈ కార్యక్రమంలోమండల విద్యాశాఖ అధికారి నాగిరెడ్డి, సర్పంచులు పంచాయతీ కార్యదర్శులు కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు వాసవిదేవి,లక్ష్మా ప్రధానోపాధ్యాయులు హతిరాం, సేవ్యా పిడి నర్సయ్య పి ఈ టి లు, సి అర్ పి లు పాల్గొన్నారు.



## ఆర్ అండ్ బి ఇంజనీరింగ్ చీఫ్ జె మోహన్ నాయక్‌కు తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ సోసియేషన్ ములుగు జిల్లా పక్షాన ఘనంగా సన్మానం

**● ములుగు జిల్లా గెజిటెడ్ ఆఫీసర్స్ సెక్రటరీ కందుల జీవన్ కుమార్**





**తొలి అక్షరం/నెక్కొండ జనవరి 20:** వరంగల్ జిల్లా మేడారం టెంపుల్ డెవలప్మెంట్ కమిటీ చైర్మన్ గా ఆర్ అండ్ బి ఇంజనీర్ ఇన్ చీఫ్ జె . మోహన్ నాయక్ ఆధ్వర్యంలో ఆలయ పునరుద్ధరణ నవీనీకరన మరియు అభివృద్ధి పనులను సకాలంలో విజయవంతం గా పూర్తి చేసిన సందర్భంగా మేడారం లో పనుల ప్రగతి పై ఇంజనీర్ ఇన్ చీఫ్ రివ్యూ చేశారు. ఇలాంటి చారిత్రక ఘట్టం లో రహదారులు మరియు భవనాలు శాఖ ఇంజనీర్ లు బృహత్తర బాధ్యత లు నిర్వహించడం అనుకున్న సమయంలో పూర్తి చేయడం రహదారులు మరియు భవనాలు శాఖ కు గర్వకారణం అవుతుంది. అని రాష్ట్ర నలుమూలల నుండి మేడారం విచ్చేసి న ఆర్ అండ్ బి ఇంజనీర్ లకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ నుండి జిల్లా అధ్యక్షులు ఏం సంపత్ రావు,సెక్రెటరీ కందుల జీవన్ కుమార్, కిరణ్ కుమార్ ర్లు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు రహీం రాజు, రాజకుమార్ తదితరులు పాల్గొన్నారు. మేడారం గద్దెల పునర్నిర్మాణం కోసం పని చేసిన ఇంజనీర్స్ రాఘవ రెడ్డి ఎస్ ఈ , సురేష్ బాబు ఈ ఈ , బి శ్యాంసింగ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ములుగు జిల్లా, రాజు పడియా డీఈఈ, ఏఈఈ లు నాగరాజు, రత్న శేఖర్, రాకేష్ సాయి తేజ, అవినాష్,వెంకటేష్ లను ఘనంగా సన్మానించారు. మేడారం జాతర పూర్తయ్యే వరకు ఇలాంటి ఆటంకాలు జరగకుండా అధికారులు అందుబాటులో ఉండి పర్యవేక్షించాలని, మోహన్ నాయక్ అధికారులకు సూచించారు.

## మండల కేంద్రంలో మొట్టమొదటి గ్రామసభ, సమస్త నెక్కొండ గ్రామ ప్రజలకి నమస్కారం

**● నెక్కొండ మేజర్ గ్రామ సర్పంచ్ పెండ్యాల హరిప్రసాద్**



**తొలి అక్షరం/నెక్కొండ జనవరి 20:** వరంగల్ జిల్లా నెక్కొండ మండల కేంద్రంలో మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ పెండ్యాల హరిప్రసాద్ ఆధ్వర్యంలో మొదటి గ్రామసభ సందర్భంగా గ్రామంలోని వివిధ సమస్యలపై మన గ్రామస్తులు మా యొక్క దృష్టికి తీసుకువచ్చిన సమస్య లో భాగంగా మన ఊరిలోన కుక్కల బెడద,ప్రమాద స్థాయిలో ఉన్నందున, మేము మా యొక్క పాలకవర్గం ఆధ్వర్యంలో కుక్కల బెడద, నుండి మన గ్రామాన్ని మన గ్రామ ప్రజలకి ఎలాంటి హాని జరగకుండా కుక్కలని పట్టించడం, రేపటి నుంచి మొదలవడం జరుగుతుంది. వీటిని వాటి పునరావాస కేంద్రాలలో వదిలేలా తగు చర్యలు తీసుకుంటున్నాము. అలాగే కోతుల బెడద కూడా ఉన్నందున ఎవరైనా దాతలని సంప్రదించి వాటిని కూడా దశల వారీగా నిరోధించడానికి ముందుకు సాగడం జరుగుతుంది . మన గ్రామ అభివృద్ధికై పలు సమస్యలు ఉన్నందున వాటిని దశలవారీగా పూర్తి చేస్తానని, తెలియజేస్తున్నాను. కావున మన గ్రామస్తులు ఇందుకు పూర్తి సహాయ సహకారాలు అందించాలని కోరుకుంటున్నాము. మన గ్రామ సభలో మన నెక్కొండ ఎస్సై మహేందర్ రెడ్డి సార్ పాల్గొని, మన నెక్కొండ ప్రజల శాంతిభద్రతలకై ఎల్లప్పుడు కృషి చేస్తానని తెలియజేశారు. మన గ్రామ అభివృద్ధికై తమతో మేము కలిసి పని చేస్తామని తెలియజేశారు. ఇట్టి గ్రామసభలో వివిధ శాఖల అధికారులు పాల్గొనగా, ఆయా శాఖలో ఉన్నటువంటి సమస్యలను వాటి దృష్టికి తీసుకెళ్లి సమస్యలు పరిష్కరిస్తామని, తెలియజేయడం జరిగింది.ఇట్టి గ్రామ సభలో మన ఊరి సమస్యలను మాదృష్ట కి తీసుకువచ్చిన ప్రజలకి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నాము. ఈ యొక్క కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ రావుల హరీష్ రెడ్డి, నెక్కొండ ఎస్సై మహేందర్, ఉప సర్పంచ్ సింగం శ్రావణి, నెక్కొండ గ్రామపంచాయతీ ఈవో సదానందం, మరియు వార్డు సభ్యులు హై స్కూల్ హెచ్ఎం శ్రీదేవి, ఆశ వర్కర్లు అలాగే అంగన్వాడి టీచర్లు గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొనడం జరిగింది.

## దశదినకర్మకి హాజరై జమ్ముల బిక్షంకి నివాళులర్పించిన నెక్కొండ మార్కెట్ కమిటీ చైర్మన్ రావుల హరీష్ రెడ్డి

**● మండల అధ్యక్షులు బక్కి అశోక్, నెక్కొండ మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ పెండ్యాల హరిప్రసాద్**



**తొలి అక్షరం/నెక్కొండ జనవరి 20:** వరంగల్ జిల్లా నెక్కొండ మండల పరిధిలోని నాగారం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు జమ్ముల వీరస్వామి, తండ్రి జముల బిక్షం అనారోగ్యంతో మృతిచెందగా దశ దినకర్మకి హాజరై జమ్ముల బిక్షం వారి చిత్రపటానికి పూలు వేసి నివాళులర్పించిన నెక్కొండ మార్కెట్ కమిటీ చైర్మన్ రావుల హరిష్ రెడ్డి,మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బక్కి అశోక్, నెక్కొండ మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ పెండ్యాల హరిప్రసాద్, మండల కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ లావుడ్య తిరుమల్,నర్సంపేట కోర్టు ఏజీపీ అడ్వకేట్ బండి శివకుమార్,నాగారం గ్రామ సర్పంచ్ నాంపల్లి విజయ- శ్రీనివాస్, గ్రామ శాఖ అధ్యక్షులు ఉప్పల లక్ష్మణ్,మార్కెట్ కమిటీ డైరెక్టర్ జమ్ముల సోమయ్య,ఉప సర్పంచ్ రాజు, తదితరులు కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాడ సానుభూతి తెలియజేశారు.

# షాద్ నగర్ పట్టణంలో బస్తీ దవాఖానను ప్రారంభించిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

**పట్టణంలోని 20వ వార్డు గంజిలో ఏర్పాటు**

**ఉదయం 9 గం నుండి సాయంత్రం 4 గం వరకు అందుబాటులో అన్ని వైద్య సేవలు**

**అన్ని రకాల వైద్య సేవలతో పాటు మందులు కూడా అందుబాటులో**

**ప్రతివారం ఒక్కొక్క రోజు ఒక్కొక్క వైద్య సేవలు అందుబాటులోకి**





**తొలి అక్షరం/షాద్ నగర్, జనవరి 20:** షాద్ నగర్ పట్టణంలోని కాలనీలోని 20వ వార్డు (పాత గంజి) లో బస్తీ దవాఖానాను ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మంగళవారం రంగారెడ్డి జిల్లా వైద్యాధికారి కే లలితాదేవి తో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డిఎం అండ్ హెచ్ ఓ విజయలక్ష్మి, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాస్, డిపిఓ అక్రమ్, సీసీ సురేష్,డాక్టర్ స్రవంతి చించోడు, డాక్టర్ దామోదర్,ఏఎన్ఎం, ఆశ వర్కర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రులను ప్రైవేటు దవాఖానాలకు దీటుగా తీర్చిదిద్ది అన్ని రకాల వైద్య సేవలు అందుబాటులోకి తీసుకొస్తున్నామని సర్కారు దవాఖానాల్లో సదుపాయాలు కల్పించడంతో పాటు బస్తీ దవాఖానాలు ఏర్పాటు చేసి డాక్టర్లు, వైద్య సిబ్బందిని నియమించి పేదలకు కార్పొరేట్ స్థాయిలో వైద్యం అందేలా చర్యలు తీసకుంటున్నట్లు తెలిపారు. మా ప్రభుత్వ ముఖ్యంగా వైద్యం,విద్య ఈ రెండిటికి మొదటి ప్రాధాన్యత ఇస్తుందని కార్పొరేట్ ఆసుపత్రిలో వైద్యం చేయించుకొని అప్పుల పాలు అవుతున్నారని అందుకే పేద ప్రజలను దృష్టిలో ఉంచుకుని పట్టణ ప్రాంతాల్లో బస్తీ దవఖానాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలియజేశారు. ముఖ్యంగా ఈ దవఖానాల్లో ప్రతి రోగానికి రక్త పరీక్షలతో పాటు అవసరమైన మందులు కూడా అందుబాటులో ఉంచడం జరిగిందని ఇక్కడున్న సిబ్బంది ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు అన్ని రకాల వైద్య సేవలు అందుబాటులో ఉండేటట్లు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. అతి త్వరలో షాద్నగర్ పట్టణంలో ఏర్పాటు కాబోయే 50 పడకల ప్రభుత్వ ఆసుపత్రిని త్వరలో అందుబాటులోకి తీసుకువచ్చేలా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తెలిపారు. ఈ సందర్భంగా రంగారెడ్డి జిల్లా వైద్యాధికారి లలిత దేవి మాట్లాడుతూ ఈ బస్తీ దవఖన సెంటర్లో ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు అన్ని రకాల సేవలు అందుబాటులో ఉంటాయని ఇందులో స్టాఫ్ నర్సులతో పాటు, అదనపు సిబ్బంది ఒక మెడికల్ ఆఫీసర్, అందుబాటులో ఉంటారని అందరికీ ఒపీ చూడబడతాయని అన్ని రకాల టెస్టులను తెలంగాణ డయాగ్నెటిక్స్ హబ్ కి పంపించడం జరుగుతుందని ఇందులో 134 పరీక్షలు అందుబాటులో ఉన్నాయని ఈ బస్సు దావఖానకు ప్రభుత్వ మెడికల్ వాహనం వచ్చి శాంపిల్స్ కలెక్ట్ చేసుకుని తెలంగాణ డయాగ్నోసిస్ సెంటర్ కు ఇవ్వడం జరుగుతుందని 24 గంటల్లో పేషంట్స్ వాట్సప్ కి రిపోర్ట్స్ యొక్క రిజల్ట్సు సమాచార రూపం అందివ్వడం జరుగుతుందని అలాగే ప్రతి సోమవారం గర్భిణులకు ప్రత్యేక పరీక్షలు నిర్వహించబడతాయని అలాగే ప్రతి మంగళవారం 15 సంవత్సరాల నుండి 65 సంవత్సరాల మహిళల వరకు అన్ని రకాల వైద్య సేవలు వీరికి అందించబడతాయని అలాగే బుధవారం శనివారం ఇమినేషన్ అనే ప్రత్యేక ప్రోగ్రాం ఉంటుందని గురువారం పెద్దవారికి ఓపి క్లీనింగ్ తో పాటు ప్రతివారం ఒక్కొక్క రోజు ఒక్కొక్క కార్యక్రమం తో పాటు బీపీ మరియు షుగర్ ఉన్నవారికి ప్రతి నెల నెల మందులు ఇవ్వడం జరుగుతుందని అలాగే శుక్రవారం ప్రతి గర్భిణీ స్త్రీ కి పరీక్షలు నిర్వహించబడతాయని అన్నారు. శనివారం ఒక్కరోజే సెలవు దినంగా ప్రకటించడం జరిగింది. అయితే ఆదివారం కూడా ఉదయం 9 గంటల నుండి 12 గంటల వరకు వైద్య సేవలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు కొంకల చెన్నయ్య ముదిరాజ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్ ఖాన్, షాద్నగర్ మాజీ మున్సిపల్ చైర్మన్ విశ్వం, కాంగ్రెస్ సీనియర్ నాయకులు చెంది తిరుపతిరెడ్డి, ఫరూక్నగర్ మండల్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు చల్ల శ్రీకాంత్ రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు అగనూరి బస్వం,ముబారక్ అలీ, ఖాదర్ మొదలగువారు పాల్గొన్నారు.

# ప్రతి విద్యార్థి ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

**• ఏఐఎంఐఎం షాద్ నగర్ అధ్యక్షులు, 1వ వార్డు మాజీ కౌన్సిలర్ గౌస్ • షాద్ నగర్ ఉర్దూ మీడియం పాఠశాలలో విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ**

**• మజ్లిస్ చారిటీస్ ఎడ్యుకేషన్ రిలీఫ్ ట్రస్ట్ సహకారంతో సాలర్ ఈ మిల్లాత్ అల్ ఇన్ వన్ బుక్స్ అందజేత • విద్యార్థులకు ఉపాయుక్తమైన బుక్స్ అందజేయడం సంతోషం: ప్రధానోపాధ్యాయురాలు**





**తొలి అక్షరం/షాద్ నగర్, జనవరి 20:** విద్యార్థులు లక్ష్యశుద్ధితో చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఏఐఎంఐఎం పార్టీ షాద్ నగర్ అధ్యక్షులు, 1వ వార్డు మాజీ కౌన్సిలర్ గౌస్ ఆకాంక్షించారు. షాద్‌నగర్ పట్టణంలోని ఉర్దూ మీడియం పాఠశాలలో ఏఐఎంఐఎం పార్టీ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచిత స్టడీ మెటీరియల్ పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. మజ్లిస్ చారిటీస్ ఎడ్యుకేషన్ రిలీఫ్ ట్రస్ట్ వారి విశేష సహకారంతో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు 'సాలర్ ఈ మిల్లాత్ అల్ ఇన్ వన్' స్టడీ మెటీరియల్ బుక్స్‌ను అందజేశారు. ఈ సందర్భంగా గౌస్ మాట్లాడుతూ.. పేద విద్యార్థులకు విద్యనందించడంలో తమ పార్టీ ఎల్లప్పుడూ ముందుంటుందని, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించాలని కోరారు. చదువుకున్న పాఠశాల కు, ఈ ప్రాంతానికి మంచి పేరు తీసుకురావాలని ఆయన విద్యార్థులకు సూచించారు. అదేవిధంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మాట్లాడుతూ.. పదో తరగతి విద్యార్థులకు ఎంతో ఉపయుక్తమైన మెటీరియల్‌ను అందించడం పట్ల ఏఐఎంఐఎం నాయకులకు, ట్రస్ట్ వారికి ఆమె ధన్యవాదాలు తెలిపారు. ఈ ఏడాది 100 శాతం ఉత్తీర్ణత తీసుకురావడానికి తమ వంతుగా కృషి చేస్తున్నామని అన్నారు. నిరంతరం విద్యార్థులకు అందుబాటులో ఉంటూ సబ్జెక్టుల వారిగా వారికి వచ్చే సందేహాలను తమ అధ్యాపక బృందం ఎప్పటికప్పుడు నివృత్తి చేస్తుందని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా 10వ తరగతి లో ఉన్న 54మంది విద్యార్థులకు పుస్తకాలను పంపిణీ చేశారు. పాఠశాల అధ్యాపక బృందం, ఎఐఎంఐఎం పార్టీ నాయకులు ఆసిఫ్ హుస్సేన్, సలీమ్, శివ కుమార్, షేక్ అక్రమ్, లాలా వాహిద్, హుస్సేన్, మొహమ్మద్, ఫరూక్, సలీమ్, ఆరిఫ్, అధ్యాపక బృందం తదితరులు పాల్గొన్నారు.

# గ్రామంలోని ఇబ్బందికరంగా ఉన్న కట్ట కింది రోడ్డును పునరుద్ధరించిన సర్పంచ్

**• బంజరపల్లి సర్పంచ్ భూక్య రమేష్ నాయక్ రాథోడ్, ఉప సర్పంచ్ ఎర్ర సుజాత- రాజు**







**తొలి అక్షరం/నెక్కొండ జనవరి 20:** వరంగల్ జిల్లా నెక్కొండ మండల పరిధిలోని బంజరపల్లి గ్రామంలో గత 5 సంవత్సరాల నుండి ఇబ్బంది కరంగా ఉన్న కట్ట కింద రోడ్డు సమస్యను మన ప్రజా ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన తరువాత సర్పంచ్ భూక్య రమేష్ రాథోడ్ తన సొంత ఖర్చులు పెట్టుకోని బండ్లు, కార్లు, ట్రాక్టర్ల రాకపోకలకు చాలా ఇబ్బందికరంగా ఉండే. ఈ రోడ్డును గురించి గ్రామ ప్రజలు సర్పంచ్, ఉప సర్పంచ్ ఎర్ర సుజాత రాజు వారి దృష్టికి తీసుకెళ్లగా సానుకూలంగా స్పందించి,త్వరితగతిన పండుగను దృష్టిలో ఉంచుకొని సమస్యను పరిష్కరించి చదును చేయడం జరిగింది,ఇట్టి కార్యక్రమంలో జనగాం వెంకన్న, భూక్య తిరుణాలు,కడుదురి రవి, ముస్కు ప్రతాప్, పొన్నాల విజేందర్, పొన్నాల స్వామి, పొన్నాల కృష్ణ, అలుబోజు చిట్టిబాబు, యార రెడ్డి, కడుధురి సూరయ్య, భూక్య శంకర్ లాల్, విక్రమ్ తదితరులు పాల్గొనడం జరిగింది. అదేవిధంగా గ్రామంలో ఎన్నో సంవత్సరాల నుండి 11 కే లైన్ ట్రాన్స్ఫారం ద్వారా కనెక్షన్ ఉండేది. అది తీసి ఎల్టిసి లను పెట్టడం జరిగింది. దీని ద్వారా గ్రామంలో వీధి దీపాలు పెట్టేటప్పుడు ప్రమాదం జరగకుండా, ఇది ఆఫ్ చేసుకుని వీధిలైట్లు పెట్టవచ్చు మనకు ఎల్సి అవసరం లేకుండానే అయిపోతుందని, ఈ కార్యక్రమాన్ని భాగస్వామిలైన కరెంటు అధికారులకు మరియు గ్రామ పంచాయతీ సిబ్బందికి బంజర పల్లి గ్రామ సర్పంచ్ భూక్య రమేష్ రాథోడ్ ధన్యవాదాలు తెలియజేశారు.

# పరిసరాల పరిశుభ్రతలో మునిపంపుల ప్రజలు భాగస్వామ్యం కావాలి

**• సర్పంచ్ బొడ్డుపల్లి వెంకటేశం • గ్రామంలో స్వచ్ఛ కార్యక్రమంలో భాగంగా మూసుకుపోయిన దారులు శుభ్రం**







**తొలి అక్షరం/రామన్నపేట జనవరి 20:** పరిసరాల పరిశుభ్రత లో గ్రామ ప్రజలందరూ భాగస్వామ్యం కావాలని పరిసర ప్రాంతాలను కలుషితం కాకుండా చూసుకోవాలని మునిపంపుల గ్రామ సర్పంచ్ బొడ్డుపల్లి వెంకటేశం తెలిపారు. గ్రామంలో ఒకటవ వార్డులో అపరిష్కృతంగా పేరుకుపోయిన కంప చెట్లని, పిచ్చి మొక్కలని తొలగించి మూసుకుపోయిన రహదారులను జెసిబి తో శుభ్రం చేయించడం జరిగింది. ఈ సందర్భంగా సర్పంచ్ వెంకటేశం మాట్లాడుతూ గ్రామంలో తడి చెత్త, పొడి చెత్తను వేరు చేసి గ్రామపంచాయతీ చెత్త ట్రాక్టర్ లో వేయాలని ఇంటి పరిసర ప్రాంతాల్లో పేరుకుపోయిన పెంట దిబ్బలను, పిచ్చి మొక్కలను తొలగించుకోవాలని. ప్రధాన వీధుల్లోపరిసరాల శుభ్రతకు గ్రామపంచాయతీ బాధ్యతగా పనిచేస్తుందని గ్రామ అభివృద్ధికి ప్రజలందరూ సహకరించాలని గెలుపునిచ్చారు. పరిసరాల పరిశుభ్రతలో గ్రామ ప్రజలందరూ భాగస్వామ్యం అయినప్పుడే ఆరోగ్యకరమైన గ్రామంగా విలసిల్లుతుందని అన్నారు. గత పది రోజులుగా మూసుకుపోయిన ప్రధాన వీధులను శుభ్రం చేస్తూ పరిసరాల పరిశుభ్రత కు పాటుపడడం జరుగుతుందని అన్నారు. గ్రామంలో పేరుకుపోయిన చెత్తను తొలగిస్తున్నందుకు గ్రామ సర్పంచి వెంకటేశం కు గ్రామ ప్రజలు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ తాళ్ళ క్రాంతి కుమార్, వార్డు సభ్యులు యాదాసు మంగమ్మనర్సింహా, యాదాసు లక్ష్మణ్, గ్రామ ప్రజలు ఎండీ మైనొద్దీన్,కూనూరు లింగస్వామి,సప్పిడి భగవంత రెడ్డి, నోముల నర్సిరెడ్డి,ఎండీ బద్రోద్దీన్,శానగొండ శ్రీధర్,ఉయ్యాల స్టాలిన్,గ్రామ పంచాయతి సిబ్బంది బూడిద మారయ్య, కనుకుంట్ల భారతమ్మ పాల్గొన్నారు.

# అంగన్వాడి కేంద్రంలో ఘనంగా అక్షరాభ్యాసం



**తొలి అక్షరం/మాడుగులపల్లి/జనవరి: 2:** దామరచర్ల ప్రాజెక్టు పరిధిలోగల మాడుగులపల్లి మండలం కోయిలపాడు అంగన్వాడి కేంద్రంలో అక్షరాభ్యాసం కార్యక్రమం చేపట్టడం జరిగింది. అనంతరం సిడిపిఓ చంద్రకళ ,సర్పంచ్ మారయ్య మాట్లాడుతూ విద్య అనేది జీవితానికి పిల్లలు జ్ఞానవంతులుగా మారుతారని పేర్కొన్నారు. గర్భిణీలు బాలింతలు పిల్లలు మంచి పౌష్టికాహారం తీసుకుని ఆరోగ్యంగా ఉండాలని తెలియజేశారు. సూపర్వైజర్ జె. నాగమణి, పంచాయతీ కార్యదర్శి వణాకర్ , పాఠశాల ప్రధానోపాధ్యాయులు శేఖర్ రెడ్డి, అంగన్వాడి టీచర్ పార్వతి,ఆయా జ్యోతి మరియు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# ప్రజల ప్రాణాలు కాపాడేందుకే పోలీసులు

**- హెల్మెట్ ధరిస్తే ప్రాణాలు కాపాడుకోవచ్చు**

**- అరైవ్ అలైవ్2026 రోడ్డు భద్రతపై అవగాహన**

**- మాడుగుల పల్లి ఎస్ఐ ఎస్ కృష్ణయ్య**




**తొలి అక్షరం/మాడుగులపల్లి/ జనవరి:20:** శిక్షించడానికి కాదని, ప్రజల ప్రాణాలు కాపాడుతానికే పోలీసులు విధులు నిర్వహిస్తారని రోడ్డు ప్రమాదాలను నియంత్రించడమే లక్ష్యంగా మాడ్గులపల్లి పోలీస్ శాఖ ఆధ్వర్యంలో " అరైవ్ అలైవ్ 2026 కార్యక్రమంలో భాగంగా యువత కు ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఎస్ ఐ మాట్లాడుతూ బైక్ పై ప్రయాణించే ప్రతి ఒక్కరూ హెల్మెట్ తప్పకుండా ధరించాలని, ఒకవేళ ప్రమాదానికి గురైతే ప్రాణాలు కాపాడుకోవచ్చని అన్నారు. ప్రతి సంవత్సరం దేశవ్యాప్తంగా అనేకమంది రోడ్డు ప్రమాదాల్లో గాయపడుతూ ప్రాణాలు కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. నల్గొండ జిల్లా పరిధిలో గత సంవత్సరం నమోదైన గణాంకాల ప్రకారం జిల్లాలో సుమారు 900నుంచి 950 వరకూ రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకోగా, అందులో దాదాపు 360మంది ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. ఈ మరణాల్లో సుమారు 90శాతం మంది ద్విచక్ర వాహనదారులే కాగా, వారిలో హెల్మెట్ ధరించకపోవడమే ప్రధాన కారణమని వెల్లడించారు. హెల్మెట్ ధరించడం ద్వారా ప్రాణాలను కాపాడుకునే అవకాశం ఎంతో ఎక్కువగా ఉంటుందని, హెల్మెట్ అనేది కేవలం ట్రాఫిక్ నిబంధన మాత్రమే కాకుండా ప్రాణ రక్షణకు అత్యంత కీలకమైన సాధనమని స్పష్టం చేశారు. అలాగే రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణాలుగా అతివేగం, మద్యం సేవించి వాహనం నడపడం (డ్రంకెన్ డ్రైవ్), ట్రాఫిక్ నియమాల ఉల్లంఘన, మొబైల్ ఫోన్ వాడుతూ డ్రైవింగ్ చేయడం, మైనర్ డ్రైవింగ్, హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించకపోవడం వంటి అంశాలను ఎస్పీ వివరించారు. ఇవన్నీ నియంత్రిస్తే ప్రమాదాల శాతం గణనీయంగా తగ్గుతుందని తెలిపారు. 18ఏళ్లు నిండకముందే వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమని, మైనర్ డ్రైవింగ్ వల్ల ప్రమాదాల సంఖ్య పెరుగుతోందని అన్నారు. అలాగే మద్యం సేవించి వాహనం నడిపితే కేవలం డ్రైవర్‌కే కాకుండా ఇతరుల ప్రాణాలకు కూడా ప్రమాదం ఏర్పడుతుందని, అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రోడ్డు భద్రత అనేది పోలీసుల బాధ్యత మాత్రమే కాదని, ప్రతి పౌరుడి బాధ్యత అని అన్నారు. ట్రాఫిక్ నియమాలను పాటిస్తే తాము సురక్షితంగా ఉండటమే కాకుండా, ఇతరుల ప్రాణాలను కూడా కాపాడిన వావు అవుతామని అన్నారు. పోలీసులు శిక్షించడానికి కాదు, ప్రజల ప్రాణాలను కాపాడేందుకే ఈ చర్యలు తీసుకుంటున్నారని స్పష్టం చేశారు. పాల్గొన్నారు.

# ఆళ్లగడ్డలో ఘనంగా త్యాగరాజ స్వామి జయంతి వేడుకలు

**తొలి అక్షరం/ఆళ్లగడ్డ :** ఆళ్లగడ్డ పట్టణంలో వాగ్గేయకారుడు త్యాగరాజ స్వామి జయంతి వేడుకలు నాయి బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పట్టణంలోని నాలుగు రోడ్ల సర్కిల్ నందు త్యాగరాజ స్వామి చిత్రపటానికి నాయి బ్రాహ్మణ అధ్యక్షుడు గురు స్వామి ఆధ్వర్యంలో సంఘ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వాయిద్య కళాకారుల సంఘం అధ్యక్షులు పెద్ద బాల నరసింహులు బృందం మరియు నాయి బ్రాహ్మణ సంఘ నాయకులు నాగేశ్వరరావు,చంద్ర మధు, సుబ్బరాయుడు, ఆదినారాయణ పాల్గొన్నారు.

# తొర్రూరు పట్టణ సమగ్రాభివృద్ధికి కృషి

- **మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించుకోవాలి: పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి**





**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో తొర్రూర్ ప్రతినిధి (సాంబ పస్తం) జనవరి 20:** తొర్రూరు పట్టణ సమగ్రాభివృద్ధికి అంకితభావంతో కృషి చేస్తున్నామని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి అన్నారు.టీయూఎఫ్ఐడీసీ నిధులు రూ.6.75 కోట్ల నిధులతో నిర్మించిన ధోబి ఘాట్,స్మశాన వాటిక,మైత్రి భవన్ కమ్యూనిటీ, పద్మశాలి, స్వామి వివేకానంద,గౌడ సంఘం,పద్మశాలి,నాయి బ్రాహ్మణ, విశ్రాంత ఉద్యోగుల,ఎస్సీ కమ్యూనిటీ హాల్ లను మంగళవారం స్థానిక నాయకులతో కలిసి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పలు సామాజిక వర్గాల కమ్యూనిటీ హాళ్ల నిర్మాణంతో ఆయా వర్గాలకు ప్రయోజనం చేకూరుతుందన్నారు. పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం శంకుస్థాపనలకే పరిమితమైందని, ఎక్కడా పనులు పూర్తి చేయలేదన్నారు.కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన రెండున్నర ఏళ్ల కాలంలో అనేక పనులు చేసి చూపించామన్నారు.తొర్రూరును స్వచ్ఛ పట్టణంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. పట్టణవాసులకు ఆహ్లాదం పంచేందుకు టీయూఎఫ్ఐడీసీ నిధులు రూ.3 కోట్ల తో పెద్ద చెరువును మినీ ట్యాంక్ బండ్ గా అభివృద్ధి పరుస్తున్నామని తెలిపారు.ఇది పూర్తయితే ఉదయం,సాయంకాలం వేళల్లో పట్టణవాసులు సేద తీరవచ్చని తెలిపారు.తొర్రూరు మున్సిపాలిటీలో సుందరీకరణ పనులు పూర్తిచేసి అందమైన పట్టణంగా తీర్చిదిద్దుతామని తెలిపారు.మినీ ట్యాంక్ బండ్ పనులు పూర్తి చేస్తామని,మంచినీటి సమస్య పరిష్కారానికి ఓవర్ హెడ్ ట్యాంక్ ఏర్పాటు చేస్తామన్నారు. రాష్ట్రంలోనే ఉత్తమ మున్సిపాలిటీగా తొరూరును తీర్చి దిద్దుతామన్నారు. మున్సిపాలిటీలో పర్యటించి అన్ని సమస్యలను గుర్తిస్తున్నామన్నారు.అవసరమైన పనులను గుర్తించేందుకు ఇప్పటికే అధికారులతో సమావేశాలు ఏర్పాటు చేసి ప్రతిపాదనలు రూపొందిస్తున్నామన్నారు. నియోజకవర్గాని కి నిధుల కేటాయింపులో ప్రాధాన్యం ఇస్తామని సీఎం హామి ఇచ్చారన్నారు.ప్రతి పేదవాడి ముఖంలో చిరునవ్వును చూసే విధంగా సీఎం రేవంత్ రెడ్డి తమకు దిశా నిర్దేశం చేశాడని,ఆ దిశగా ప్రజలకు సేవలందిస్తున్నామన్నారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పేదలకు ఇందిరమ్మ ఇండ్లు,కొత్త రేషన్ కార్డులు,సన్న బియ్యం,200 యూనిట్ల ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించాలని గుర్తు చేశారు. తొర్రూరు మున్సిపాలిటీ అభివృద్ధికి మరో రూ. 15 కోట్లు మంజూరయ్యాయని,త్వరలోనే ఆ పనులు ప్రారంభిస్తామని తెలిపారు. మున్సిపాలిటీ అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలంటే రానున్న మునిసిపల్ ఎన్నికల్లో అధికార పార్టీ అభ్యర్థులను గెలిపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతిపక్షాలతో మునిసిపాలిటీకి ఒరిగేది ఏమీ లేదన్నారు. పట్టణవాసులు విజ్ఞతతో ఆలోచించి మున్సిపాలిటీ ఎన్నికల్లో తీర్పు ప్రకటించాలన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వక్కల శ్యాంసుందర్, టీపీసీసీ మాజీ సభ్యుడు ముత్తినేని సోమేశ్వరరావు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు హమ్యా నాయక్, కాంగ్రెస్ మండల వారికి ప్రెసిడెంట్ మేకల కుమార్, పట్టణ అధ్యక్షుడు సోమ రాజశేఖర్,సీనియర్ నాయకులు పెదగాని సోమయ్య, పోనుగొట్టి సోమేశ్వరరావు,చాపల అనిత బాపురెడ్డి, గంజి విజయపాల్ రెడ్డి, మంగళపల్లి రామచంద్రయ్య, జీనుగా సురేందర్ రెడ్డి, యాకూబ్ రెడ్డి, నరసయ్య, మహిళా బ్లాక్ అధ్యక్షురాలు పింగిలి ఉష, జలకం శ్రీనివాస్, శ్రావణ్ కుమార్, దొంగరి రేవతి శంకర్,కల్లూరి కుషాల్, మనోహర్,సురేష్,రాజేష్ యాదవ్, మహేశ్వరి, మహేష్,స్వామి వివేకానంద సేవా సంఘం ప్రతినిధులు వజనపల్లి అనిల్ కుమార్, కుర్ర శ్రీనివాస్, గౌరీ శంకర్, ఇమ్మడి రాంబాబు, హిరాధర్,మైత్రి వ్యవస్థాపక అధ్యక్షులు జీనుగా విప్లవ రెడ్డి, ప్రధాన కార్యదర్శి బొల్లి కృపాల్, సలహాదారులు తీగల కృష్ణారెడ్డి, నాయి బ్రాహ్మణ సంఘం డివిజన్ అధ్యక్షులు గడిల మల్లయ్య, మండల అధ్యక్షులు ఎనగందుల శ్రీనివాస్,పట్టణ అధ్యక్షుడు లింగాల శంకర్, విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు మైస నాగయ్య, మండల అధ్యక్షుడు ఇట్టే సోమిరెడ్డి, కార్యదర్శి యాకూబ్,గౌడ నాయకులు చీకటి రమేష్ గౌడ్, బొమ్మగాని నర్సయ్య,జలగం స్వామి గౌడ్, పద్మశాలి నాయకులు బోతే విక్రమ్, పిండం రమేష్, వెంకన్న, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

# పాలమూరు జిల్లాలో వేడెక్కిన మున్సిపల్ పోరు

**రిజర్వేషన్ల ఖరారుతో రంగంలోకి ఆశావహులు**

**సిఎం సొంత జిల్లా కావడంతో ప్రత్యేక దృష్టి**

**అన్ని పార్టీల్లోనూ గెలుపుపై ఆశాభావం**



**మహబూబ్‌నగర్,జనవరి20:** ఉమ్మడి పాలమూరు జిల్లాపై ఇప్పుడు అందరి దృష్టి పడింది. సిఎం సొంత జిల్లా కావడంతో పాటు, ఇప్పుడు ఇక్కడ అనేక అభివృద్ది కార్యక్రమాలకు రేవంత్ రెడ్డి శ్రీకారం చుట్టారు. తచూ జిల్లాలో ఏదో ఒక పనిమీద పరుగులు పెడుతున్నారు. దీంతో ఈ ఉమ్మడి జిల్లా మున్సిపాలిటీలపై ప్రత్యేక శ్రద్ద కనబరుస్తున్నారు. మహూబ్‌నగర్ పార్లమెంట్ నియోజకవర్గంలో ఏడు మున్సిపాలిటీలు ఉండగా.. జడ్చర్ల పాలకవర్గం పదవీ కాలం ఇంకా పూర్తి కాలేదు. మహబూబ్‌నగర్, నారాయణపేట జిల్లాల్లోని భూత్పూర్, దేవరకద్ర, కోస్గి, మద్దూరు, మక్తల్, నారాయణపేట మున్సిపాలిటీలు, మహబూబ్‌నగర్ కార్పొరేషన్‌కు ఎన్నికలు జరగనున్నాయి. ఈక్రమంలో కాంగ్రెస్ హైకమాండ్ గెలుపు బాధ్యతలను జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహకు అప్పగించింది. మంత్రి దామోదరకు మహబూబ్‌నగర్ పార్లమెంట్ బాధ్యతలను అప్పగించింది. ముందుగా ఆయా మున్సిపాలిటీలు, కార్పొరేషన్ పరిధిలోని లీడర్లతో సమావేశం కానున్నారు. వార్డులు, డివిజన్లలో పార్టీ పరిస్థితి, ప్రతిపక్షాల బలాలు, బలహీనతలపై చర్చించనున్నారు. పార్టీ నుంచి పోటీకి ఎవరు ఆసక్తి చూపుతున్నారు. ఏయే స్థానాల్లో లీడర్ల మధ్య పోటీ ఎక్కువగా ఉంది. అక్కడ ఎవరిని బరిలోకి దింపితే గెలిచే అవకాశం ఉంది. ఎవరిని నిలపాలి..ఎవరిని తప్పించాలి.. రెబల్స్ ఉంటే వారిని బుజ్జగించి.. ఇతర అవకాశాలు కల్పించేలా హైకమాండ్ నుంచి హామీలు ఇప్పించే ప్రయత్నాలు చేయనున్నారు. దీనికితోడు వార్డులు, డివిజన్ల వారీగా ఎప్పటికప్పుడు ప్రజానాడిని, అక్కడి పరిస్థితులను లీడర్లతో సమీక్షించనున్నారు. అసరమైతే రెండు, మూడు డివిజన్లకు ఒక లీడర్‌ను ఇన్ చార్జీగా నియమించే అవకాశాలు ఉన్నాయి. వార్డులు, డివిజన్లలో పర్యటిస్తూ పార్టీ క్యాండిడేట్లను గెలిపించే బాధ్యతను తీసుకోనున్నారు. ఇకపోతే పోటీ చేయాలనుకున్న అభ్యర్థులు పలుచోట్ల సంక్రాంతి సందర్భంగా క్రికెట్ పోటీలు నిర్వహించి, ఖర్చులను వార్డు లీడర్లు భరించారు. నడిగడ్డలో ఈసారి త్రిముఖ పోటీ నెలకొంది. ఇప్పటికే కాంగ్రెస్ సమావేశాలు నిర్వహించి మున్సిపల్ ఎన్నికలకు క్యాడర్ ను సిద్ధం చేసింది. బీజేపీ నాయకులు కూడా ప్రతిరోజు మీటింగ్ లు పెట్టుకుంటూ కార్యకర్తల్లో జోష్ నింపే ప్రయత్నం చేస్తున్నారు. బీఆర్ఎస్ కు చెందిన మాజీ మంత్రులు ఇప్పటికే రెండుసార్లు సమావేశాలు నిర్వహించారు. జోగులాంబ గద్వాల జిల్లాలో గద్వాల, అలంపూర్, అయిజ, వడ్డేపల్లి మున్సిపాలిటీల్లో ఎన్నికలు జరగనున్నాయి. గద్వాలలో 37 వార్డులు, అయిజలో 20 వార్డులు, అలంపూర్ లో 10, వడ్డేపల్లిలో 10 వార్డులు ఉన్నాయి. వార్డుల వారీగా రిజర్వేషన్లు ఖరారు కావడంతో ఎన్నికల వేడి మొదలు అయింది. ఇప్పటికే కొన్ని చోట్ల వివిధ పార్టీల నుంచి పోటీలో ఉండే అభ్యర్థులు వార్డులో ప్రభావం చూపే ఓటర్లను మచ్చిక చేసుకునేందుకు ప్లాన్ చేస్తున్నారు. కుల సంఘాలు, యూత్ లీడర్లను కలిసి తమకు మద్దతు తెలియజేయాలని కోరుతున్నారు. గెలుపే లక్ష్యంగా పోటాపోటీగా ప్రచారం చేయడంతో పాటు నజరానాలు పంపిణీ చేసేందుకు సిద్ధం అవుతున్నారు. జోగులాంబ గద్వాల జిల్లాలో త్రిముఖ పోటీ నెలకొంది. కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ మధ్య పోటీ తీవ్రంగా ఉండే అవకాశాలు కనిపిస్తున్నాయి. గద్వాల మున్సిపాలిటీలో మూడు పార్టీలు బలంగా ఉండడంతో ఎక్కువ స్థానాలు గెలుపొంది చైర్మన్ స్థానాన్ని కైవసం చేసుకునేందుకు అందరూ వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నారు. అలంపూర్ నియోజకవర్గంలోని అయిజ, ఆలంపూర్, వడ్డేపల్లి మున్సిపాలిటీల్లో కూడా పోరు రసవత్తరంగా మారనుంది. వార్డుల్లో పోటీ చేసేందుకు ప్రతి వార్డుకు ముగ్గురిని ఎంపిక చేసి వారి పేర్లను హైకమాండ్‌కు పంపించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. లోకల్‌గా ఎలాంటి ఇబ్బంది లేకుండా హైకమాండ్ ఎంపిక చేసేలా చూస్తున్నారు. వార్డుల్లో గెలిచే అభ్యర్థులకే పార్టీ టికెట్ ఇచ్చేలా వ్యూహాత్మకంగా పార్టీలు వ్యవహరిస్తున్నాయి. వార్డుల్లో ఏ వర్గానికి చెందిన ఓట్లు ఎక్కువగా ఉన్నాయనే విషయంతో పాటు ఆర్థికంగా బలంగా ఉన్న అభ్యర్థులను నిలబెట్టేందుకు మూడు పార్టీలు తమవంతు ప్రయత్నం చేస్తున్నాయి.

# శబరిమల ఆలయ బంగారు తాపడాల కేసు

- **విచారణలో దూకుడు పెంచిన ఇడి**
- **మూడు రాష్ట్రాల్లో ఏకకాలంలో సోదాలు**



**తిరువనంతపురం,జనవరి20:** శబరిమల ఆలయ బంగారు తాపడాల కేసుపై విచారణ జరుపుతున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ దూకుడు పెంచింది. ఇటీవల సుప్రీం కూడా ఈ ఏసుపై సీరియస్‌గా దృష్టి సారించింది. ఈ కేసు విచారణలో భాగంగా మంగళవారం మూడు రాష్ట్రాల్లోని 21 ప్రాంతాల్లో ఏకకాలంలో సోదాలు చేపట్టింది. మనీలాండరింగ్ నిరోధక చట్టం కింద కేరళ, కర్ణాటక, తమిళనాడులలో ఈ సోదాలు జరుగుతున్నాయి. ఈ కేసులో ప్రధాన నిందితుడు ఉన్నికృష్ణన్ పొట్టి, ట్రావన్‌కోర్ దేవశ్వం బోర్డు మాజీ అధ్యక్షుడు పద్మకుమార్‌లకు సంబంధం ఉన్న ప్రాంతాల్లోను, వారి సన్నిహితులకు సంబంధించిన ఇళ్లల్లోనూ ఏకకాలంలో సోదాలు నిర్వహిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. మరోవైపు ఈ కేసుపై కేరళ హైకోర్టు పర్యవేక్షణలో పనిచేస్తున్న రాష్ట్ర ప్రత్యేక దర్యాప్తు బృందం కూడా దర్యాప్తు చేస్తోంది. ఈ కేసులో మరింత క్షుణ్ణంగా దర్యాప్తు చేపట్టడానికి బంగారు తాపడాల పునరుద్ధరణ పనుల్లో భాగమైన ఇతర అధికారులను కూడా విచారిస్తున్నట్లు తెలిపారు. ఈ కేసులో ఇటీవల అరెస్టైన టీడీబీ మాజీ అధ్యక్షులు ఎ.పద్మకుమార్, మాజీ సభ్యుడు కె.పి.శంకరదాస్‌ల హయాంలోనే ఈ అక్రమాలకు బీజం పడిందన్నారు. శబరిమల ఆలయంలో ఆన్-సైట్ తనిఖీ చేయాలని కేరళ హైకోర్టు ఇటీవల సిట్ అధికారులను ఆదేశించింది. మరోవైపు ఈ కేసును కేంద్ర దర్యాప్తు సంస్థకు బదిలీ చేయాలని భక్తులు, పలువురు అధికారులు డిమాండ్ చేస్తున్నారు. ఈ కేసులో ఆలయ ప్రధాన పూజారి సహా ఇప్పటివరకు 12 మందిని పోలీసులు అరెస్టు చేశారు.

# రాజ్యసభలో పలు బిల్లులు పెండింగ్

**జనభా నియంత్రణ సహా 19 బిల్లుకు దక్కని మోక్షం**



**న్యూఢిల్లీ,జనవరి20:** రాజ్యసభలో 19 ప్రభుత్వ బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. వాటిలో 1992 నాటి జనాభా నియంత్రణకు సంబంధించిన బిల్లు కూడా ఉంది. రాజ్యసభ అనేది శాశ్వత సభ, ఇది ఎప్పటికీ రద్దు చేయబడదు. దాని సభ్యులలో మూడింట ఒక వంతు మంది ప్రతి రెండేళ్లకు పదవీ విరమణ చేస్తారు. లోక్‌సభ లో పెండింగ్‌లో ఉన్న బిల్లులు సభ రద్దయితే, అవి కూడా రద్దవుతాయి. రాజ్యసభలో పెం డింగ్‌లో ఉన్న బిల్లులు ఎప్పుడూ రద్దు కావు. రాజ్యసభ బులెటిన్ ప్రకారం.. ప్రస్తుతం 19 బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. వాటిలో పురాతనమైనది రాజ్యాంగ (79 సవరణ) బిల్లు-1992. జనాభా నియంత్రణ, చిన్న కుటుంబ నియమాన్ని ప్రభుత్వం ప్రోత్సహిం చాలని, ప్రాథమిక విధుల్లో చిన్న కుటుంబ నియమాన్ని ప్రోత్సహించడం, స్వీకరించడం చేర్చాలని ప్రభుత్వ విధాన నిర్దేశక సూత్రాలను సవరించాలని ఈ బిల్లు ప్రతిపాదించింది. ఇద్దరు కంటే ఎక్కువ మంది పిల్లలుంటే ఎంపి లేదా ఎమ్మెల్యేను అనర్హులుగా ప్రకటించాలని కూడా ఇది ప్రతిపాదించింది. పెండింగ్ బిల్లుల్లో ఢిల్లీ అద్దె (సవరణ) బిల్లు-1997 కూడా ఉంది. ఇది అ÷-దదె నియంత్రణ చట్టాలను ఆధునీకరించడానికి ఉద్దేశించిన ఢిల్లీ అ÷-దదె చట్టం-1995ను సవరించడానికి ఉద్దేశించబడింది. కానీ అద్దెదారులు, భూస్వామి సమూహాల నుండి గణనీయమైన వ్యతిరేకతను ఎదుర్కొంది. ప్రభుత్వం సీడ్ బిల్లు-2025 తీసుకు రావడానికి ప్రయత్నిస్తుండగా, పెండింగ్ బిల్లుల్లో సీడ్స్ బిల్లు-2004 ఉంది. ఇది అమ్మకం, దిగుమతి, ఎగుమతి కోసం విత్తనాల నాణ్యతను నియంత్రించడం, నాణ్యమైన విత్తనాల ఉత్పత్తి, సరఫరాను సులభతరం చేయడం లక్ష్యంగా పెట్టుకుంది.కాంగ్రెస్ అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గే కార్మికశాఖ మంత్రిగా ఉన్నప్పుడు ప్రవేశపెట్టిన అంతర్రాష్ట్ర వలస కార్మికుల (ఉపాధి నియంత్రణ, సేవా పరిస్థితుల) సవరణ బిల్లు-2011 కూడా పెండింగ్‌లో ఉంది.యుపిఎ-2లో ప్రవేశపెట్టిన ఇతర పెండింగ్ బిల్లుల్లో భవన, ఇతర నిర్మాణ కార్మికుల సంబంధిత చట్టాలు (సవరణ) బిల్లు-2013, ఉపాధి మార్పిడి సవరణ బిల్లు-2013, పార్లమెంటరీ, అసెంబ్లీ నియోజకవర్గాల్లో షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల ప్రాతినిధ్య పునర్ వ్యవస్థీకరణ (మూడో) బిల్లు-2013 ఉన్నాయి.న్డిఎ పాలనలో ప్రవేశపెట్టిన పెండింగ్ బిల్లుల్లో అస్సాం, మేఘాలయ, త్రిపుర, మిజోరాంలలో స్వయం ప్రతిపత్తి మండళ్ల ఆర్థిక, కార్యనిర్వాహక అధికారాలను పెంచడంతో ఈశాన్య ప్రాంతంలో గిరిజన స్వయం ప్రతిపత్తిని బలోపేతం చేయడానికి ఉద్దేశించిన బిల్లు. ప్రవాస భారతీయుల వివా హ నమోదు బిల్లు-2019 వంటి బిల్లులు ఉన్నాయి. తాజాగా ది పెస్టిసైడ్ మేనేజ్‌మెంట్ బిల్లు-2020 పెండింగ్‌లో ఉంది.

# గంభీర్ తప్పిదం వల్లే ఘోర ఓటమి

**• వెటరన్ బ్యాటర్ అజింక్యా రహానే**



టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ అనాలోచిత నిర్ణయాల కారణంగానే న్యూజిలాండ్ చేతిలో ఘోర పరాజయం ఎదురైందని వెటరన్ బ్యాటర్ అజింక్యా రహానే అన్నాడు. జట్టులో తరుచూ మార్పులు చేయడం టీమిండియా ఓటమిని శాసించిందని అభిప్రాయపడ్డాడు. న్యూజిలాండ్‌తో మూడు వన్డేల సిరీస్‌ను 2–1తో టీమిండియా కోల్పోయిన సంగతి తెలిసిందే. ఈ సిరీస్‌లో తొలి మ్యాచ్ గెలిచిన టీమిండియా.. తర్వాతి రెండు మ్యాచ్‌ల్లో ఓటమిపాలైంది. 38 ఏళ్ల తర్వాత భారత గడ్డపై న్యూజిలాండ్ తొలి వన్డే సిరీస్ గెలిచింది. ఈ పరాజయం నేపథ్యంలో టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్‌తో పాటు మేనేజ్‌మెంట్‌పై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. తాజాగా ఈ పరాజయంపై మాట్లాడిన రహానే.. టీమిండియా ఓటములపై బరాబర్ ప్రశ్నలు వస్తాయని తెలిపాడు. 'జట్టు ప్రదర్శనపై కచ్చితంగా కఠినమైన ప్రశ్నలు ఎదురవుతాయి. భారత్ గత 9 వన్డేల్లో ఐదు ఓడిపోయింది. అందుకు కారణం.. జట్టులో అతిగా మార్పులు చేయడం. అందుకే మేనేజ్‌మెంట్ నుంచి ఆటగాళ్లకు తమ స్థానాలపై భరోసా కావాలని చెబుతున్నా. ప్రపంచకప్ వంటి మెగా టోర్నీలకు సిద్దమవుతున్నప్పుడు మేనేజ్‌మెంట్ నుంచి ఆటగాళ్లకు భద్రతతో పాటు స్పష్టత అవసరం. ఒక నిర్దిష్ట ఫార్మాట్‌లో కొందరు ఆటగాళ్లను ఆడించాలనుకున్నప్పుడు.. ఆ విషయంలో వారికి స్పష్టత ఉండాలి. ఓటములు ఎదురైనప్పుడు ప్రశ్నలు వస్తాయి. అది చాలా సహజం. ఎందుకంటే అభిమానులు భారత క్రికెట్‌తో అంతగా ముడిపడి ఉంటారు. భారత బాగా ఆడాలని, మ్యాచ్ గెలవాలని, సిరీస్ గెలవాలని కోరుకుంటారు.

# జడేజా వన్డేల్లో రిటైర్మెంట్ తీసుకుంటున్నాడా?


భారత్ క్రికెట్ చరిత్రలో అత్యుత్తమ ఆల్‌రౌండర్లలో ఒకరిగా ఉన్న రవీంద్ర జడేజా కెరీర్ ఇప్పుడు ఒక కీలక మలుపులో ఉన్నట్టు కనిపిస్తోంది. గత దశాబ్ధం కాలంగా మూడు ఫార్మాట్‌లలో టీమ్ ఇండియాకు వెన్నెముకగా నిలిచిన ఈ సౌరాష్ట్రస్టార్ తాజాగా తన రిటైర్మెంట్‌పై చేసిన వ్యాఖ్య సంచలనంగా మారుతున్నాయి. ఇటీవల న్యూజిలాండ్‌తో జరిగిన మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌లో జడేజా ప్రదర్శిఆశించిన స్థాయిలో లేదు. ఆల్‌రౌండర్‌గా జట్టులో తన ప్రాధాన్యతను నిరూపించుకోవాల్సిన చోట ఆయన విఫలమయ్యాడు. మూడు మ్యాచ్‌ల్లో కలిపి కనీసం ఒక్క వికెట్ కూడా తీయలేకపోవడం, అలాగే బ్యాటింగ్‌లో మూడు ఇన్నింగ్స్‌లు ఆడి కనీసం 30 పరుగులు కూడా చేయలేకపోవడం అభిమానులను, విశ్లేషకులను విస్మయానికి గురి చేసింది. సోషల్ మీడియాలో ప్రస్తుతం ఒక వీడియో విపరీతంగా వైరల్ అవుతుంది. అందులో రవీంద్ర జడేజా, వికెట్ కీపర్ బ్యాట్ రిషబ్ పంత్ ఒక కార్యక్రమంలో పాల్గొని సరదాగా ముచ్చటించారు. ఆ సమయంలో వారిద్దరినీ మీరు ఎప్పుడైనా సినిమాల్లో నటించాలని అనుకున్నారా అని ప్రశ్నించగా పంత్ సమాధానమిస్తూ.... నేను ఇంకా దాని గురించి ఆలోచించలేదు. నన్ను క్రికెట్ ఆడనివ్వండి, జడేజా భాయ్ గురించి నాకు తెలియదు. అని సరదాగా వ్యాఖ్యానించారు. దీనికి జడేజా స్పందిస్తూ నవ్వుతూనే ఒక బాంబు పేల్చారు. అంటే నా సమయం అయిపోయిందని పరోక్షంగా చెబుతున్నాడు అని జడేజా వ్యాఖ్యానించారు. పైకి ఇది నవ్వుతూ అన్న మాట అయినప్పటికీ అంతర్జాతీయ క్రికెట్‌లో తన ప్రస్థానం ముగింపు దశకు చేరుకుదని సంకేతాన్ని ఆయన ఇచ్చారని విశ్లేషకులు భావిస్తున్నారు. ఇప్పటికే 2024 టీ 20 ప్రపంచ కప్ తర్వాత జడేజా టీ 20 ఇంటర్నేషనల ఫార్మాట్ నుంచి రిటైర్మెంట్ ప్రకటించిన సంగతి తెలిసిందే. అతను ప్రస్తుతం ఆయన కేవలం టెస్టు, వన్డే క్రికెట్‌లో మాత్రమే కొనసాగుతున్నాడు. జడేజా తర్వాత వాషింగ్టన్ సుందర్ లేదా అక్షర్ పటేల్‌లలో ఒకరు వన్డేలలో అతని స్థానంలో రావచ్చు. అయితే, ఇద్దరు ఆటగాళ్లు చాలా కాలంగా భారతదేశం కోసం వన్డే క్రికెట్ ఆడుతున్నారు. అక్షర్ ఇప్పటివరకు 71 వన్డేలు, వాషింగ్టన్ 29 వన్డే మ్యాచ్‌లు ఆడారు.



# ఒకే రోజు రెండు భారత్ వర్సెస్ పాకిస్తాన్ మ్యాచ్‌లు..!



టోర్నీ ఏదైనా సరే భారత్, పాకిస్తాన్ జట్లు తలపడుతున్నాయంటే వచ్చే కిక్కే వేరు. ఇరు దేశాల అభిమానులే కాదు ప్రపంచ వ్యాప్తంగా ఉన్న క్రికెట్ ఫ్యాన్స్ సైతం భారత్ వర్సెస్ పాక్ మ్యాచ్ కోసం ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తుంటారు అన్న సంగతిని ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. ఇక ఇప్పుడు అందరి దృష్టి ఫిబ్రవరి 15 పైనే ఉంది. ఎందుకంటే ఆ రోజు టీ20 ప్రపంచకప్ 2026లో భాగంగా భారత్, పాకిస్తాన్ జట్లు తలపడనున్నాయి. అయితే.. అదే రోజు మరో భారత్ వర్సెస్ పాక్ మ్యాచ్ కూడా జరగనుంది. తొలి మ్యాచ్ లో పురుషుల జట్లు తలపడనుండగా రెండో మ్యాచ్ మహిళల ఆసియా కప్ రైజింగ్ స్టార్స్‌లో భాగంగా జరగనుంది. మహిళల ఆసియా కప్ రైజింగ్ స్టార్స్ షెడ్యూల్‌ను ఆసియా క్రికెట్ కౌన్సిల్ విడుదల చేసింది.



# స్టేడియంలో చెలరేగిన మంటలు.. ప్రాణభయంతో పరుగులు తీసిన జనం!

ఆస్ట్రేలియాలో ప్రతిష్టాత్మకంగా జరుగుతున్న బిగ్ బాష్ లీగ్ మ్యాచ్‌లో అనూహ్య ఘటన చోటుచేసుకుంది. మంగళవారం (జనవరి 20) పెర్త్ వేదికగా పెర్త్ స్కార్చర్స్, సిడ్నీ సిక్సర్స్ మధ్య క్వాలిఫైయర్ మ్యాచ్ జరుగుతుండగా, స్టేడియంలోని ఒక భాగంలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. పెర్త్ ఆప్టస్ స్టేడియం భవనానికి బయటి వైపు ఉన్న ఒక గది నుంచి నల్లటి పొగ భారీగా ఆకాశంలోకి వ్యాపించడంతో స్టేడియంలో ఉన్న వారంతా భయాందోళనకు గురయ్యారు. మ్యాచ్ జరుగుతున్న సమయంలోనే ఈ ఘటన జరగడం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. తొలి ఇన్నింగ్స్‌లో పెర్త్ స్కార్చర్స్ బ్యాటింగ్ చేస్తున్న సమయంలో స్టేడియం భవనం నుంచి పొగ రావడం టీవీ స్క్రీన్లపై స్పష్టంగా కనిపించింది. వెంటనే అప్రమత్తమైన స్టేడియం సెక్యూరిటీ సిబ్బంది, అగ్నిమాపక దళం అక్కడికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు.

అదృష్టవశాత్తూ ఈ ప్రమాదం స్టేడియం బయటి గదిలో జరగడంతో ప్రాణనష్టం తప్పింది. ఆటగాళ్లకు లేదా ప్రేక్షకులకు ఎటువంటి హాని కలగలేదు. కాసేపు గందరగోళం నెలకొన్నప్పటికీ, మంటలు అదుపులోకి రావడంతో మ్యాచ్‌ను యథావిధిగా కొనసాగించారు.

# వరల్డ్ కప్‌లో అగ్రస్థానంలో టీమిండియా


ఐసీసీ అండర్–19 ప్రపంచకప్ 2026లో భారత యువ జట్టు విజయ యాత్ర కొనసాగిస్తోంది. శనివారం బంగ్లాదేశ్‌తో జరిగిన ఉత్కంఠభరిత పోరులో ఆయుష్ కెప్టెన్సీలోని టీమిండియా 18 పరుగుల తేడాతో ఘనవిజయం సాధించింది. ఈ విజయంతో భారత్ అధికారికంగా సూపర్–6 దశకు చేరుకుంది. సూపర్–6కు అర్హత సాధించిన మొదటి జట్టుగా భారత్ నిలిచింది. అంతకుముందు జరిగిన తొలి మ్యాచ్‌లో అమెరికాను 6 వికెట్ల తేడాతో చిత్తు చేసిన భారత్, ఇప్పుడు వరుసగా రెండో విజయాన్ని నమోదు చేసి గ్రూప్–బిలో అగ్రస్థానంలో కొనసాగుతోంది. ఈ మెగా టోర్నీలో మొత్తం 16 జట్లు తలపడుతున్నాయి. వీటిని నాలుగు గ్రూపులుగా విభజించగా, ప్రతి గ్రూపు నుంచి మొదటి మూడు స్థానాల్లో నిలిచిన జట్లు సూపర్–6కు వెళ్తాయి. ప్రస్తుతం భారత్ ఉన్న గ్రూప్–బిలో న్యూజిలాండ్ రెండో స్థానంలో ఉండగా, అమెరికా మూడో స్థానంలో ఉంది. బంగ్లాదేశ్ తన మొదటి మ్యాచ్‌లో ఓడిపోయి చివరి స్థానంలో ఉంది. భారత్ ఆడిన రెండు మ్యాచ్‌ల్లోనూ ఆల్ రౌండ్ ప్రదర్శనతో ఆకట్టుకోవడం విశేషం. మిగిలిన గ్రూపుల విషయానికి వస్తే.. గ్రూప్–ఏలో శ్రీలంక, గ్రూప్–సిలో ఇంగ్లండ్, గ్రూప్–డిలో ఆఫ్ఘనిస్తాన్ తమ ఆధిపత్యాన్ని చాటుతున్నాయి. ఆశ్చర్యకరంగా గ్రూప్–డిలో బలమైన దక్షిణాఫ్రికా, వెస్టిండీస్ జట్ల కంటే ఆఫ్ఘనిస్తాన్ ముందంజలో ఉంది. పాకిస్తాన్ గ్రూప్–సిలో ఇంగ్లండ్ తర్వాత రెండో స్థానంలో కొనసాగుతోంది. భారత జట్టు తదుపరి మ్యాచ్‌లలో ఇదే ఫామ్ కొనసాగిస్తే, ఆరోసారి టైటిల్ గెలవడం కష్టమేమీ కాదని విశ్లేషకులు భావిస్తున్నారు.

# తిలక్ వర్మ ప్లేస్‌లో ఆడేది ఎవరు?

**• నేటినుండి విండీస్ తో భారత్ తొలి టీ20 మ్యాచ్ • జట్టులో కొన్ని కీలక మార్పులకు అవకాశం • జట్టులోకి రానున్న శ్రేయస్ అయ్యర్**



వన్డే సిరీస్‌ను కోల్పోయిన కసిలో ఉన్న టీమిండియా, ఇప్పుడు పొట్టి ఫార్మాట్‌లో కివీస్‌ను దెబ్బకొట్టేందుకు సిద్ధమైంది. నాగ్‌పూర్‌లోని విదర్భ క్రికెట్ అసోసియేషన్ స్టేడియం వేదికగా బుధవారం (జనవరి 21) రాత్రి 7 గంటలకు తొలి టీ20 మ్యాచ్ ప్రారంభం కానుంది. సూర్యకుమార్ యాదవ్ సారథ్యంలోని భారత జట్టులో కొన్ని కీలక మార్పులు చోటు చేసుకునే అవకాశం ఉంది. టీమిండియా యువ బ్యాటర్ తిలక్ వర్మ గాయం కారణంగా ఈ సిరీస్‌లోని మొదటి మూడు మ్యాచ్‌లకు దూరం కావడం భారత జట్టుకు పెద్ద ఎదురుదెబ్బ. అతనికి ఆపరేషన్ జరగడంతో, అతని స్థానంలో వెటరన్ బ్యాటర్ శ్రేయస్ అయ్యర్‌ను జట్టులోకి తీసుకున్నారు. అయితే, టీ20 వరల్డ్ కప్ 2026 జట్టులో ఉన్న ఇషాన్ కిషన్ కూడా రేసులో ఉన్నాడు. సుదీర్ఘ కాలం తర్వాత జట్టులోకి వచ్చిన ఇషాన్ కిషన్‌ను మిడిల్ ఆర్డర్‌లో ఆడిస్తారా లేక శ్రేయస్ అయ్యర్‌కు అవకాశం ఇస్తారా అనేది ఆసక్తికరంగా మారింది. అయ్యర్ ప్రస్తుతం వరల్డ్ కప్ జట్టులో లేనందున, బ్యాకప్ ప్లేయర్‌గా అతన్ని పరీక్షించే అవకాశం ఉంది. ఓపెనింగ్‌లో అభిషేక్ శర్మతో కలిసి సంజూ శాంసన్ వచ్చే అవకాశం ఉంది. వికెట్ కీపర్ బాధ్యతలతో పాటు ఓపెనర్‌గా సంజూ తన మార్క్ చూపించాల్సి ఉంది. వన్డేల్లో వైఫల్యాలు చవిచూసిన సూర్యకుమార్ యాదవ్, తనకు ఇష్టమైన టీ20 ఫార్మాట్‌లో మళ్ళీ ఫామ్ అందుకోవాలని చూస్తున్నాడు. ఆల్ రౌండర్ల విభాగంలో హార్దిక్ పాండ్యా, అక్షర్ పటేల్, శివం దూబేలు జట్టుకు బలాన్ని ఇస్తున్నారు. ఇక ఫినిషర్ పాత్రలో రింకూ సింగ్ మరోసారి తన పవర్ చూపించడానికి సిద్ధమయ్యాడు. బౌలింగ్ విషయానికి వస్తే.. జస్ప్రీత్ బుమ్రా నాయకత్వంలో అర్ష్‌దీప్ సింగ్, హర్షిత్ రాణాలు పేస్ బాధ్యతలు మోయనున్నారు. నాగ్‌పూర్ పిచ్ సాధారణంగా స్పిన్నర్లకు అనుకూలంగా ఉంటుంది కాబట్టి, వరుణ్ చక్రవర్తి ప్రధాన స్పిన్నర్‌గా బరిలోకి దిగడం ఖాయం. మరో స్పిన్ ఆప్షన్‌గా రవి బిష్ణోయ్ లేదా కుల్దీప్ యాదవ్‌లలో ఒకరిని ఎంచుకోవాల్సి ఉంటుంది. వన్డే సిరీస్ కోల్పోయిన భారత్, ఈ టీ20 సిరీస్‌ను విజయంతో ప్రారంభించి వరల్డ్ కప్ ముందర ఆత్మవిశ్వాసాన్ని పెంచుకోవాలని భావిస్తోంది.




# జడేజా కోహ్లీని చూసి నేర్చుకోవాలి: అశ్విన్

పేలవ ఫామ్‌తో ఇబ్బంది పడుతున్న టీమిండియా స్టార్ ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజాకు మాజీ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ కీలక సలహా ఇచ్చాడు. టీమిండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ తరహాలో జడేజా తన ఆటను మెరుగుపర్చుకోవాలని సూచించాడు. ఆటలో కొత్త ప్రయోగాలు చేయాలని జడేజాకు తాను ఎప్పుడూ చెబుతూ ఉంటానని, కానీ అతను తన బౌలింగ్ శైలిని మార్చుకోడని చెప్పాడు. కొన్నేళ్లుగా బ్యాటింగ్, బౌలింగ్‌లో నిలకడగా రాణిస్తుండటంతోనే జడేజా ఇలా మొండిగా తయారయ్యాడని తెలిపాడు. న్యూజిలాండ్‌తో మూడు వన్డేల సిరీస్‌లో జడేజా దారుణంగా విఫలమయ్యాడు. బ్యాటింగ్‌లో తీవ్రంగా నిరాశపర్చిన జడేజా బౌలింగ్‌లో ఒకే ఒక్క వికెట్ తీసాడు. ధారళంగా పరుగులిచ్చుకున్నాడు. అతని వైఫల్యం టీమిండియా విజయవకాశాలను ప్రభావితం చేసింది. ఈ సిరీస్‌లో 2 1తో భారత్ ఘోర పరాజయం చవిచూసింది. ఈ క్రమంలోనే తన యూట్యూబ్ ఛానెల్ వేదికగా జడేజా గురించి మాట్లాడిన అశ్విన్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. 'జడేజాకు తాను నమ్మే కొన్ని బలాలు ఉన్నాయి. అతను తన బలాలకు మించి ఏమి చేయడు. కాస్త నెమ్మదిగా.. భిన్నంగా బౌలింగ్ చేయాలని సూచించినా పట్టించుకోడు. ఎందుకంటే జడేజా తన బలాలను నమ్ముకొనే బౌలింగ్ చేస్తాడు. అతని బలాలే కొన్నిసార్లు బలహీనతలుగా మారుతున్నాయి. బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్ మూడు విభాగాల్లో అతనికి ఉన్న నైపుణ్యం అసాధారణం. కానీ కొత్త ప్రయోగాలు చేయడు. నెట్స్‌లో క్యారమ్ బాల్స్ వేస్తాడు, కానీ మ్యాచ్‌లో మాత్రం ప్రయత్నించడు. లెజెండ్ అయిన జడేజాకు కోల్పోయేదేమీ లేదు. కొంచెం ఫంకీగా ఆడితే చూడాలని ఉంది. అతను నిరూపించుకోవాల్సింది కూడా ఏం లేదు. ఎప్పటికీ జడేజా దిగ్గజమే. విరాట్ కోహ్లీలా జడేజా కూడా తన ఆటను మెరుగుపర్చుకోవాలి. కోహ్లీ ప్రస్తుతం ఎలాంటి చింత లేకుండా ఆడుతున్నాడు. ఈ ప్రపంచానికి తానే రాజును అన్నట్లు ఆటను ఆస్వాదిస్తున్నాడు. అందుకే అతను ఇంత బాగా రాణిస్తున్నాడు. జడేజాకు ఇది సవాల్‌తో కూడిన సమయం. అక్షర్ పటేల్ అతని స్థానాన్ని భర్తీ చేసేందుకు సిద్దంగా ఉన్నాడు. జడేజా వన్డేల్లో ఎన్నో గొప్ప ప్రదర్శనలు చేశాడు. కానీ ఇప్పుడు చర్చంతా అతని బ్యాటింగ్ చుట్టూనే తిరుగుతోంది. స్పిన్నర్లపై తక్కువ స్ట్రైక్ రేట్ గురించి మాట్లాడుతున్నారు. అయితే ఇప్పుడే ఎవరి భవిష్యత్తుపై తీర్పు ఇవ్వడం తొందరపాటు అవుతుంది.'అని అశ్విన్ చెప్పుకొచ్చాడు.



# బాబీ దర్శకత్వంలో చిరు తదుపరి సినిమా

ఓవైపు థియేటర్లలో 'మన శంకర వరప్రసాద్‌గారు' చిత్ర సందడి కొనసాగుతుండగా.. మరోవైపు చిరంజీవి తదుపరి చిత్ర పనులు చకచకా సాగిపోతున్నాయి. బాబీ దర్శకత్వంలో ముస్తాబు కానున్న ఈ సినిమా వచ్చే నెలలో లాంఛనంగా మొదలు కానుంది. మార్చి నుంచి చిరు రంగంలోకి దిగనున్నట్లు తెలుస్తోంది. కాగా, ఇప్పుడీ చిత్ర కథాంశానికి సంబంధించి మరో ఆసక్తికర విషయం బయటకొచ్చింది. ఇది కూతురి సెంటిమెంట్‌తో ముడిపడిన యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ఉంటుందని సమాచారం. దీంట్లో మలయాళ అగ్రహీరో మోహన్‌లాల్ ప్రత్యేక పాత్రలో అలరిస్తారని.. ఈ కథలో తన పాత్ర చాలా కీలకంగా ఉంటుందని తెలిసింది. ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాల్ని త్వరలో వెల్లడించనున్నారు.



# విజయ్ సేతుపతితో మణిరత్నం సినిమా

**• హీరోయిన్‌గా సాయిపల్లవి ఖరారు**

తనదైన నటనతో ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకున్న తమిళ నటుడు విజయ్ సేతుపతి వరుస సినిమాలతో బిజీగా ఉన్నారు. ప్రస్తుతం ఆయన సూపర్ స్టార్ రజనీకాంత్ తో జైలర్ 2 తో పాటు టాలీవుడ్ దర్శకుడు పూరి జగన్నాథ్ డైరెక్షన్ లో స్లమ్ డాగ్ అనే సినిమా అలాగే మరికొన్ని చిత్రాల్లో నటిస్తున్నారు. ఇదిలా ఉండగా విజయ్ సేతుపతి నెక్స్ట్ సినిమాపై కోలీవుడ్ లో ఒక ఆసక్తికర చర్చ జరుగుతుంది. తాజా సమాచారం ప్రకారం, విజయ్ సేతుపతి ప్రముఖ దర్శకుడు మణిరత్నం దర్శకత్వంలో ఓ సినిమాలో నటించనున్నారు. ఆసక్తికరమైన విషయం ఏమిటంటే, ఈ కథను మణిరత్నం తొలుత సిలంబరాసన్ టీఆర్ శింబు కోసం రాసుకున్నారట. అయితే కొన్ని కారణాల వల్ల శింబు ఈ ప్రాజెక్ట్‌లో భాగం కావడం లేదట. దీంతో అదే కథకు విజయ్ సేతుపతిని హీరోగా ఫైనల్ చేసినట్లు తెలుస్తోంది. ఈ సినిమాలో విజయ్ సేతుపతికి జోడీగా సాయి పల్లవి నటించనున్నారు. సహజమైన నటనకు పేరు తెచ్చుకున్న సాయి పల్లవి, సుప్రసిద్ధ దర్శకులు మణిరత్నం డైరెక్షన్, విజయ్ సేతుపతి లాంటి పవర్‌ఫుల్ నటుడు కలిసి చేసే ఈ సినిమాపై అంచనాలు ఓ రేంజ్ లో ఉంటాయనడంలో సందేహం లేదు. ప్రస్తుతం చేస్తున్న సినిమాల తర్వాత విజయ్ సేతుపతి కెరీర్‌లో ఈ మణిరత్నం సినిమాను సెట్స్ పైకి తీసుకువెళ్లాలా ఎ÷-లాన్ చేస్తున్నారట. ఈ చిత్రం సేతుపతి కెరీర్ లో ఓ ప్రత్యేకమైన మైలురాయిగా నిలిచే అవకాశం ఉందని సినీ వర్గాలు భావిస్తున్నాయి.

# శర్వానంద్‌కు కలిసి వచ్చిన బాలయ్య సెంటిమెంట్

టాలీవుడ్‌లో కొన్ని చిత్రాలకు సంబంధించిన విశేషాలు భలే ఆసక్తికరంగా మారుతుంటాయి. అలాంటి సంఘటన ఒకటి హీరో శర్వానంద్ నటించిన నారి నారి నడుమ మురారి సినిమాకు జరిగింది. శర్వా హీరోగా రామ్ అబ్బరాజు డైరెక్షన్ లో అనిల్ సుంకర నిర్మించిన ఈ సినిమా సంక్రాంతి కానుకగా రిలీజ్ అయి సూపర్ హిట్ గా నిలిచింది. ఫెస్టివల్ సీజన్‌లో వచ్చిన చిత్రాల్లో చిన్న సినిమాగా వచ్చి ప్రేక్షకుల నుంచి మంచి ఆదరణ పొందుతూ బాక్సాఫీస్ వద్ద బి÷-గగెస్ట్ బ్లాక్‌బస్టర్‌గా మారింది. ఈ సినిమాకు సంబంధించిన ఓ ఆసక్తికరమైన విషయం ఇప్పుడు సినీ వర్గాల్లో, సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారింది. దాదాపు 36 ఏళ్ల క్రితం నందమూరి బాలకృష్ణ హీరోగా, ఏ. కోదండరామిరెడ్డి దర్శకత్వంలో 'నారి నారి నడుమ మురారి' అనే సినిమా విడుదలై అప్పట్లో సూపర్ హిట్‌గా నిలిచింది. అందుకే అదే టైటిల్‌ను శర్వానంద్ సినిమా కోసం ఫిక్స్ చేయగానే, అది బాలకృష్ణ సినిమా టైటిల్ కదా అని ఆయన అనుమతి తీసుకోవాలని శర్వానంద్ స్వయంగా బాలకృష్ణకు ఫోన్ చేసి విషయం వివరించగా, ఈ విషయం నాకెందుకు చెప్తున్నావు, నిరభ్యంతరంగా టైటిల్ పెట్టుకో అంటూ బాలయ్య గ్రీన్ సిగ్నల్ ఇచ్చారట. అంతేకాదు, టైటిల్ పెట్టుకోమని చెప్పడమే కాకుండా సినిమా షూటింగ్‌కు, టైటిల్ రివీల్ కు ముహూర్తం కూడా బాలకృష్ణ ఫిక్స్ చేశారట. ఇక భారీ సినిమాల మధ్య పోటీగా రిలీజ్ అయినా నారి నారి నడుమ మురారి శర్వా కెరీర్ లో బిగ్గెస్ట్ హిట్ గా నిలిచి ఇటు నిర్మాతలకు అటు డిస్ట్రిబ్యూటర్స్ కు భారీ లాభాలు తెచ్చిపెడుతోంది. ఈ



విషయాన్నీ బాలయ్యకు చెప్పేందుకు శర్వానంద్ మరోసారి కాల్ చేయగా 'నా పేరు కాపాడావు? సినిమా సూపర్ హిట్ అయిందని తెలిసింది. ఇలానే రాబోయే రోజుల్లో మరిన్ని మంచి సినిమాలు చేయాలి' అంటూ శర్వానంద్‌ను దీవించారట బాలయ్య. ఆ సంతోషాన్ని తన ఫ్రెండ్స్ తో షేర్ చేసుకుంటూ ఇక నుంచి నా సినిమాలన్నింటికీ బాలయ్యతోనే ముహూర్తం పెట్టించుకుంటాను అని అన్నారట. మొత్తానికి, బాలయ్య టైటిల్ తో ఆయన పెట్టిన ముహూర్తంతో శర్వానంద్‌కు భారీ హిట్ అందుకున్నాడు.

# దృశ్యం-3 కోసం వెంకటేశ్ బిజీ

కథానాయకుడు వెంకటేశ్ ప్రస్తుతం చిరంజీవితో కలిసి 'మన శంకరవర ప్రసాద్‌గారు' చిత్రంతో థియేటర్లలో నవ్వులు పంచుతున్న సంగతి తెలిసిందే. ఇక ఆయన సోలో హీరోగా చేస్తున్న సినిమా 'ఆదర్శ కుటుంబం హౌస్ నెం.47' శరవేగంగా చిత్రీకరణ చేసుకుంటోంది. త్రివిక్రమ్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం ఈ వేసవిలోనే థియేటర్లలో సందడి చేయనున్నట్లు ఇప్పటికే ప్రకటించారు. కానీ, దీని తర్వాత వెంకీ చేయనున్న సినిమా ఏదన్నది ఇంకా వెల్లడించలేదు. అయితే ఇప్పుడీ అంశంపై నిర్మాత సురేశ్‌బాబు నుంచి స్పష్టత వచ్చింది. త్రివిక్రమ్ సినిమా పూర్తయిన వెంటనే వెంకటేశ్ 'దృశ్యం 3' కోసం రంగంలోకి దిగనున్నట్లు వెల్లడించారు. అన్నీ అనుకున్నట్లు జరిగితే ఈ సినిమాని హిందీ 'దృశ్యం 3'తో పాటుగా అక్టోబరులో విడుదల చేసే అవకాశముందన్నారు.

ఇక ఇప్పటికే 'దృశ్యం 3' మలయాళ వెర్షన్ చిత్రీకరణ పూర్తి చేసుకోగా. అది ఏప్రిల్‌లో విడుదల కానుంది.



# ఆలోచింప చేసే అద్భుత సినిమా దండోరా




**• సినిమాను చూసి మెచ్చుకున్న ఎన్టీఆర్**

తెలుగులో ఇటీవలే ప్రేక్షకుల ముందుకు ప్రశంసలు అందుకున్న 'దండోరా' సినిమాపై అగ్ర కథానాయకుడు జూనియర్ ఎన్టీఆర్ ప్రశంసల వర్షం కురిపించాడు . ఈ సందర్భంగా ఎక్స్ వేదికగా పోస్ట్ పెట్టాడు. 'ఇప్పుడే దండోరా సినిమా చూశాను. ఇది ఎంతో లోతైన, శక్తివంతమైన మరియు ఆలోచింపజేసే చిత్రం. శివాజీ, నవదీప్, నందు, రవికృష్ణ, బిందు మాధవిలు తమ నటనతో సినిమా ఆద్యంతం అద్భుతంగా రాణించారు. ఇంతటి బలమైన రచనతో, మన మూలాలకు దగ్గరగా ఉండే కథను ఎంతో చక్కగా తెరకెక్కించిన దర్శకుడు మురళీ కాంత్ గారికి నా హ్యాట్సాఫ్. ఇలాంటి గొప్ప ప్రయత్నాన్ని ప్రోత్సహించి, నిర్మించిన రవీంద్ర బెనర్జీ గారికి అభినందనలు. ఈ గొప్ప చిత్రంలో భాగమైన నటీనటులకు, సాంకేతిక నిపుణులకు నా హృదయపూర్వక శుభాకాంక్షలు.' అంటూ జూనియర్ ఎన్టీఆర్ రాసుకోచ్చాడు. అయితే ఎన్టీఆర్ లాంటి గ్లోబల్ స్టార్ నుంచి ప్రశంసలు అందడంతో చిత్ర యూనిట్ అమితానందంలో మునిగిపోయింది. 'ఎన్టీఆర్ అన్న నా పేరు పలికారు, ఇది నాకు చాలు' అంటూ దర్శకుడు మురళీ కాంత్ భావోద్వేగానికి లోనవ్వగా, నిర్మాత ఇది



తమకు అసలైన విజయం అని సంతోషం వ్యక్తం చేశారు. గతేడాది డిసెంబర్ 25న థియేటర్లలో విడుదలైన ఈ చిత్రం ప్రస్తుతం అమెజాన్ ప్రైమ్ వీడియోలో స్ట్రీమింగ్ అవుతోంది. ఎన్టీఆర్ ప్రశంసలతో ఈ సినిమాకు ఒక్కసారిగా విపరీతమైన క్రేజ్ పెరగడమే కాకుండా, ప్రస్తుతం ఇండియాలో అమెజాన్ ప్రైమ్ టాప్-2లో ట్రెండింగ్‌లో నిలుస్తూ రికార్డు సృష్టిస్తోంది.